

యువతకు ఉపాధి

పెట్టుబడులు తెస్తాం... పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం.. ఇదే మా లక్ష్యం

» ఏలూరులో యువతతో నారా లోకేశ్ ముఖాముఖి



ఏలూరు టూ టౌన్/పెదపాడు, మే 5 : 'ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు పెట్టుబడులు తీసుకొస్తాం, పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తాం' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. యువగళంలో భాగంగా 'హలో లోకేశ్' కార్యక్రమం ఆదివారం ఏలూరులో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు, యువత అడిగిన ప్రశ్నలకు లోకేశ్ సమాధానాలు చెప్పారు. 'చంద్రబాబు సీఎంగా వున్న ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టును 70 శాతం పూర్తిచేశారు. ఈ ఐదేళ్లలో జగన్ ఐదు శాతం పనులు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలవరం పూర్తిచేస్తాం. చింతలపూడి ఎత్తిపోతలు పూర్తి చేయ డమే కాకుండా పట్టిసీమ ద్వారా తాగు, సాగు నీరందించేం దుకు చర్యలు తీసుకుంటాం. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఆక్వా రైతులకు ఎన్నో ప్రోత్సాహకాలు ఇచ్చి ఆదుకున్నారు. వరి రైతులకు రాయితీలు ఇచ్చారు. ఏలూరు, గోదావరి కాల్వల్లో పూర్తిస్థాయిలో నీరు పారించి, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి పంట లు అధికంగా పండించడానికి సహకారం అందిస్తాం. పెట్టు బడులు, పరిశ్రమలు, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా, రైతులకు రాయితీలు ఇవ్వడం ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తాం. గత ఐదేళ్ల జగన్ పాలనలో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ వసతి గృహాలన్నీ అధ్వానంగా తయారయ్యాయి. సరైన మరుగుదొడ్లు లేక పిల్లలు ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారు. జగన్ పాలనలో కాస్మొటిక్ చార్జీలు, మెస్ చార్జీలు ఒక్కసారిగా పెంచలేదు. జిల్లాలో యువతను గంజాయి మత్తులో జగన్ ప్రభుత్వం ముంచుతోందని, టీడీపీ అధికారంలోకి రాగానే గంజాయి సాగును, రవాణాను ఉక్కు పాదంతో అణిచివేస్తాం. స్కిల్ డవలప్‌మెంట్ ద్వారా యువత కు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా'మంటూ లోకేశ్ హామీ నిచ్చారు. అనంతరం యువతతో ముఖాముఖి మాట్లాడారు.



శేషవర్ధన్, ప్రైవేటు ఉద్యోగి

■ మీ రాష్ట్రానికి రాజధాని ఉందా ? అని ఇతర రాష్ట్రాల్లోని నా స్నేహితులు అడుగుతున్నారు. ఏం చెప్పాలో అర్థం కావడం లేదు. అలాగే రాష్ట్రంలో మా భూములకు రక్షణ ఉందా ?

● **లోకేశ్ :** ఉమ్మడి ప్రభుత్వం రాగానే అమరావతి రాజధానిగా ప్రకటించి అభివృద్ధి చేస్తాం. రాజధాని లేని రాష్ట్రంగా జగన్ తయారుచేశాడు. జగన్‌కు మళ్లీ అవకాశమిస్తే మీ భూములను లాగేసుకుంటాడు. మేం రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తాం.



నివాస్, విద్యార్థి

■ చంద్రబాబు హయాంలో స్కాలర్‌షిప్‌లు ఇచ్చారు. జగన్ వాటిని రద్దు చేశారు. మీరు వాటిని ఇస్తారా?

● **లోకేశ్ :** మేము అధికారంలోకి రాగానే విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు ఇస్తాం.



అక్షయశ్రీ, నిరుద్యోగి

■ మీరు అధికారంలోకి వస్తే గోదావరి జిల్లాలకు ఏంచేస్తారు ?



● **లోకేశ్ :** ఆక్వా రంగానికి ప్రోత్సాహకాలు, వరి రైతులకు రాయితీలు, స్టార్టప్ కంపెనీల ఏర్పాటు, ఐటీ, రవాణా రంగాల అభివృద్ధి, సిమెంట్ రోడ్ల నిర్మాణంతోపాటు పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తాం.

చాందిని, విద్యార్థిని

■ విద్యా రంగంలో ఎలాంటి మార్పులు తీసుకొస్తారు ?

● **లోకేశ్ :** కేజీ నుంచి పీజీ వరకు విద్యను బలోపేతం చేస్తాం. జగన్ విలీనం చేసిన పాఠశాలలను తిరిగి పాత పద్ధతిలోకి తీసు కొస్తాం. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను బలోపేతం చేస్తాం. విదేశీ విద్య ద్వారా ఎక్కువ మందిని ఇతర దేశాలకు పంపుతాం.

భావన, విద్యార్థి

■ ఉద్యోగాల భర్తీ ఎలా చేస్తారు ?



● **లోకేశ్ :** ఏటా సింగిల్ యూనిఫైడ్ జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. అన్ని ప్రభుత్వ విభాగాల్లోని పోస్టులను భర్తీచేస్తాం. మెగా డీఎస్సీ పైనే తొలి సంతకం.



దుర్గా ప్రసాద్, విద్యార్థి

■ అంగన్‌వాడీ పిల్లల్లో పౌష్టికాహర లోపం ఉంది. మీరొస్తే ఏంచేస్తారు ?

● **లోకేశ్ :** అంగన్‌వాడీలు జీతాలు పెంచమంటే కేసులు, జైళ్లలో పెట్టిన ఘనత జగన్‌ది. కూటమి అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసి పిల్లలకు మెరుగైన పౌష్టికాహారం అందిస్తాం. ఏలూరు డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు నిర్మిస్తాం. హాస్టళ్ల సంఖ్య, మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచుతాం.



అనూష, నిరుద్యోగి

■ మా డివిజన్ వైసీపీ కార్పొరేటర్ జిజ్జువరపు రమేష్ కుమార్ పేదలకు చెందిన 40 ఇళ్లు కబ్జా చేశాడు. మీరేమైనా విడిపిస్తారా?

● **లోకేశ్ :** వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. మన ప్రభుత్వం రాగానే ఆ కార్పొరేటర్ నుంచి ఇళ్ల స్థలాలన్నింటినీ స్వాధీనం చేసుకుని ఎవరి భూములు వారికి అప్పగిస్తాం.





గజదొంగ సీఎం జగన్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టండి. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌ను గెలిపించండి. చంద్రబాబు సీఎం అయిన వంద రోజుల్లోనే రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారుతుంది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి గోదావరి జిల్లాలకు న్యాయం చేస్తాం. జగనొక 420, ఆయన ఆస్తులకన్నా కేసుల లిస్టే పెద్దది. ఏ నోట విన్నా జగన్ కుర్చీ ఖాళీ చేయ్ అనే నినాదాలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటవుతుందనే ఆలోచనతోనే రౌడీలు, గూండాలు, స్మగ్లర్లు, గంజాయి, బ్లేడు బ్యాచ్‌లు రాష్ట్రం వదిలి పారిపోతారు. ల్యాండ్ టైటాలింగ్ యాక్ట్‌పై మాట్లాడినందుకు నాపై 24వ కేసు పెట్టారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని లోకేశ్ అన్నారు.



యామిని వర్మ, నిరుద్యోగి

■ అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు ఇస్తారా ?

● **లోకేశ్ :** అగ్రవర్ణాలకు చెందిన నిరుద్యోగులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తాం.



సీఆర్‌ఆర్ రెడ్డి కాలేజ్ వద్ద విద్యార్థులను పరిశీలించి పంపుతున్న పోలీసులు

'నీట్' పరీక్షకు 1,318 మంది హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మే 5 : ఎంబీబీఎస్, తదితర వైద్య విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే 'నీట్-యూజీ' పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా మొత్తానికి ఏలూరులోని మూడు కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 1,361 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,318 మంది హాజరయ్యారు. 43 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదని నీట్ పరీక్ష కేంద్రాల సిటీ కో-ఆర్డినేటర్ వై.ఎస్.ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. సీఆర్‌ఆర్ పరీక్ష కేంద్రంలో 491 మంది, సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్ పరీక్ష కేంద్రంలో 485 మంది, ఆదిత్య డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో 342 మంది పరీక్ష రాశారని వివరించారు. పేపర్, పెన్ విధానంలో జరిగిన ఈ పరీక్ష నిర్వహణకు ఎన్‌టీఏ నిబంధనల మేరకు పకడ్బందీ ఏర్పాట్లను చేశారు. పరీక్ష గదుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను నేరుగా ఢిల్లీలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కు అనుసంధానం చేసి, అక్కడి నుంచే పరీక్ష నిర్వహణ తీరుని పర్యవేక్షించారు. ముందుగానే ప్రకటించిన నిబంధనల మేరకు విద్యార్థులను పరీక్ష కేంద్రం బయట క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించారు. పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పని చేయకుండా జామర్లను ఏర్పాటు చేశారు. నీట్ పరిశీలకులుగా నియమితులైన ఐదుగురు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.



ఇయర్ రింగ్స్ తీయాల్సిందే..



నా నంబర్ ఎక్కడుందో..

నేడు 'ఐసెట్'

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే 'ఐసెట్' ఆన్‌లైన్ పరీక్ష సోమవారం నిర్వహించేందుకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పరీక్ష ఏలూరులోని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలల్లో జరుగుతుంది. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో రెండు పూటలా ఈ పరీక్షలు నిర్వహించడానికి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) సంస్థ సిద్ధమైంది.

11,874 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగం

ఏలూరు సిటీ/ ఉంగుటూరు/ చింతలపూడి / కైకలూరు/ నూజివీడు టౌన్, మే 5 : ఏలూరు జిల్లాలో ఆదివారం సాయంత్రం నాటికి ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల్లో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో 11,874 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో మొత్తం 1,689 మంది ఓటర్లు ఉండగా నారాయణపురం హైస్కూలు ఫెసిలిటేషన్ సెంటర్‌లో శని, ఆదివారాల్లో 1402 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆర్వో ఖాజావలి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోస్టల్ బ్యాలెట్ కోసం ఈనెల 7, 8 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. కైకలూరులో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ తీరును పరిశీలించారు. కాగా కైకలూరులో జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 1,582 మందికి గాను 1305 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారని, 85 శాతం ఓటింగ్ జరిగినట్టు ఎన్నికల ఆర్వో భాస్కర్ తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలో శనివారం 727 మంది, ఆదివారం 725 మంది మొత్తం 1452 మంది (84 శాతం) ఉద్యోగస్తులు తమ ఓటును వినియోగించుకున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో 1,662 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించు కున్నారన్నారు. ఎన్నికల అధికారి అద్దయ్య, జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర కూడా ఓటును వినియోగించు కున్నారు. కాగా నియోజకవర్గంలో హోం ఓట్లు 128 గాను 118 పోలయ్యాయి. రెండు ఓట్లు డెత్‌గా నమోదు అయ్యాయి. పోలవరం నియోజకవర్గంలో 2,308 మంది, ఏలూరు నియోజకవర్గంలో 1,827 మంది, దెందులూరు నియోజకవర్గంలో 1,918 మంది పోస్టల్ బ్యాలెట్‌ను ఆయా నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో వినియోగించుకున్నారు. ఓటుహక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని జేసీ లావణ్యవేణి సూచించారు. వట్లూరు సర్ సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఆదివారం ఆమె పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు.



వట్లూరులోని సర్ సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో ఓటేసిన జేసీ లావణ్యవేణి



నూజివీడులో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటున్న ఉద్యోగిని



కైకలూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ

ఏలూరులో సదుపాయాల కల్పన

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేష్ ఆదేశాల మేరకు ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో రోజు ఆదివారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సజావుగా జరగడానికి ఎన్నికల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రం వద్ద ఆరు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఉద్యోగులకు మైక్ ద్వారా సమాచారం అందించారు. టోకెన్ సిస్టమ్ అందుబాటులోకి తెచ్చి పోలింగ్ విధానం సరళతరం చేశారు. చలువ పందిళ్ళు, తాగునీరు సదుపాయాలతో పాటు మజ్జిగ, స్నాక్స్ ఓటర్లకు అందించారు. జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఆర్వో ముక్కంటి, కమిషనర్ వెంకటకృష్ణ పోలింగ్ నిర్వహణను పర్యవేక్షించారు.






చింతలపూడిలో ఓటు వేసిన డీఎస్పీ రవిచంద్ర, ఆర్వో అద్దయ్య

ఉద్యోగి ఓటు హక్కును తిరస్కరించరాదు..

ఏలూరు సిటీ, మే 5 : ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగి ఓటు హక్కును ఎట్టి పరిస్థితుల్లో తిరస్కరించ వద్దని, స్పాట్‌లోనే ఫారం-12 ను స్వీకరించి అర్హులైన ఉద్యోగులందరికీ ఓటు హక్కు కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులకు, ఆర్వోలకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న కొందరు ఓటర్లు ఫారం-12ను సకాంలో సమర్పించలేకపోవడం వల్ల తమ ఓటును వినియోగించుకోలేక పోతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చినట్టు ఆయన తెలిపారు. అనివార్య పరిస్థితులు కారణంగా ఎన్నికల విధుల్లో ఉన్న ఓటరు మే1వ తేదీ లోగా ఫారం-12 ను సమర్పించలేకపోతే ఏ ఆర్ఓ పరిధిలో ఆ ఉద్యోగి ఓటరుగా నమోదయ్యారో, ఆ ఆర్వో కు ఫారం-12 సమర్పించేందుకు, సంబంధిత ఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేయబడిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కును వినియోగిం చుకునేందుకు అనుమతించాలన్నారు. ఈనెల 7, 8 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆ ఫెసిలిటేషన్ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాలను అనుసరించి ఏలూరు జిల్లాలో అర్హత కలిగిన ప్రతీ ఉద్యోగి తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు.

ఏలూరు ఎవరిదో..?



» కూటమి ఎంపీ అభ్యర్థి మహేష్ యాదవ్ ప్రచారాస్త్రాలు
» వైసీపీ అభ్యర్థి సునీల్‌కు సవాళ్ళు ఎన్నో
» కాంగ్రెస్, ఇండిపెండెంట్ల హోరా హోరీ ప్రచారం
» గెలుపు గుర్రాన్ని అధిరోహించేందుకు ఎన్నో తంటాలు
» ఏలూరు లోక్‌సభ స్థానంపై విశ్లేషణ

5

ఏలూరు రూపురేఖలు మారుస్తా

» రౌడీయిజం అంతుతేలుస్తా
» అందరికి ఉపాధి, మౌలిక సదుపాయాలు
» కొత్త పరిశ్రమలు వచ్చేలా కార్యాచరణ
» ప్రజా మద్దతుతో నా గెలుపు ఖాయం
» ఆంధ్రజ్యోతితో టీడీపీ అభ్యర్థి బడేటి చంటి

6

ఎన్నికల్లో మైక్రో పరిశీలకుల పాత్ర కీలకం

» ఎన్నికల సాధారణ పరిశీలకులు

డా. కృష్ణకాంత్ పాఠక్, ఎస్‌ఏ రామన్

ఏలూరు సిటీ, మే 5 : ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా నిర్వహించడంలో మైక్రో పరిశీలకుల పాత్ర ఎంతో కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు డా. కృష్ణకాంత్ పాఠక్, ఎస్‌ఏ రామన్‌లు పేర్కొన్నారు. ఆదివారం సర్ సీఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో ఎన్నికల మైక్రో పరిశీలకులకు నిర్వహించిన రెండవ విడత శిక్షణలో ఎన్నికల సాధారణ పరిశీలకులు వారిద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ ఎన్నికల పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ప్రత్యక్ష పాత్ర లేకున్నా నిఘా నేత్రాలలో పరిశీలిస్తూ తప్పిదాలు ,ఉల్లంఘనలు సంభవిస్తే వెంటనే ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకురావాలన్నారు. తమ విధి నిర్వహణలో ఏమైనా అనుమానాలు వస్తే ఫోన్ నెంబరు 915469 0377కు తెలిపి నివృత్తి చేసుకోవాలన్నారు. పోలవరం, నూజివీడు, చింతలపూడి, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్‌ఏ రామన్ మాట్లాడుతూ పోలింగ్‌కు ముందు మాక్‌పోల్, ఓటింగ్ గది, పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించాలన్నారు. జిల్లా యంత్రాంగం గుర్తించిన 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు మైక్రో పరిశీలకునలు నియమించటంతో పాటు వారికి రెండు విడతలు శిక్షణ అందించామన్నారు. మే 12వ తేదీ ఉదయం 10 గంటలకు సంబంధిత రిసెప్షన్ కేంద్రాలకు మైక్రో పరిశీలకులు చేరుకోవాలన్నారు. మైక్రో పరిశీలకులు కేవలం పోలింగ్ విధానాన్ని పరిశీలించాలే తప్ప మీడియా, తదితరులతో సంభాషించడం వంటివి చేయకూడదన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే తమ ఫోన్ నెంబరు 94910 41437 నెంబరుకు ఫోన్ చేసి తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాల న్నారు. డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ బి.సోమశేఖర్, ఎల్‌డీఎం నీలాద్రి, కలెక్టరేట్ ఏవో కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

» సినీ హీరో నారా రోహిత్

తణుకు, మే 5 : కార్యదక్షత కలిగిన చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రముఖ సినీ హీరో నారా రోహిత్ అన్నారు. ఆదివారం రాత్రి కమ్మ కల్యాణ మండపంలో యువతతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'వైసీపీ ప్రభుత్వంలో యువతకు ఉపాధి లేక తెలంగాణకు వలసలు పోయే పరిస్థితి వచ్చింది. రాష్ట్రం బాగుపడాలంటే ఎన్డీఏ కూటమి రావాలి. వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఎన్నో కేసులు పెట్టి వేధించింది. భవిష్యత్ మారాలంటే ఓటే ఆయుధం. మనమే కాకుండా మరో పది మందికి చెప్పి కూటమి ఓటు వేయించాలి. పవన్ ప్రజల కోసం తపన పడుతూ పనిచేస్తున్నారు. ఆరిమిల్లి రాధాకృష్ణ వంటి వ్యక్తిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది' అన్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి మాట్లాడుతూ 'దుర్మార్గమైన వైసీపీ పాలన అంతమొందించాల్సిన సమయం వచ్చింది. పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. కూటమి ప్రభుత్వం ద్వారానే అందరి జీవితాల్లో వెలుగులు వస్తాయి. ప్రశాంతతకు నిలయమైన తణుకులో వైసీపీ కనుసన్నల్లోనే గంజాయి అమ్మకాలు సాగుతున్నాయి. నేను వచ్చిన వెంటనే ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు లేకుండా యువత భవిష్యత్‌కు భరోసా కల్పిస్తాం. చంద్రబాబు అను భవం, జనసైనికుల బలంతో పెద్ద విజయం సాధించబోతు న్నాం' అని అన్నారు. యువ నాయకులు ఆరిమిల్లి నిఖిల్‌రత్న తోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నారా రోహిత్, చిత్రంలో తణుకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ



నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,42,763
పురుషులు 1,18,965, స్త్రీలు 1,23,793, ఇతరులు 5

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1962	తానేటి వీరరాఘవులు	కాంగ్రెస్	సుందరరావు	స్వతంత్ర	661
1967	తానేటి వీరరాఘవులు	కాంగ్రెస్	సీహెచ్.ఉయ్యూరురావు	సీపీఎం	18,932
1972	సాలి వెంకట్రావు	స్వతంత్ర	తానేటి వీరరాఘవులు	కాంగ్రెస్	1328
1978	దాసరి సరోజినిదేవి	కాంగ్రెస్	సాలి వెంకట్రావు	జనతా	21479
1983	కారుపాటి వివేకానంద	టీడీపీ	దాసరి సరోజినిదేవి	కాంగ్రెస్	37395
1985	కారుపాటి వివేకానంద	టీడీపీ	నంబూరి ఝాన్సీరాణి	కాంగ్రెస్	24868
1989	కారుపాటి వివేకానంద	టీడీపీ	డాకే అభిమన్యు	కాంగ్రెస్	7852
1994	జొన్నకూటి బాబాజీరావు	టీడీపీ	కారుపాటి వివేకానంద	కాంగ్రెస్	39460
1999	జొన్నకూటి బాబాజీరావు	టీడీపీ	మద్దాల సునీత	కాంగ్రెస్	2986
2004	మద్దాల సునీత	కాంగ్రెస్	కొప్పాక అబ్బులు	టీడీపీ	7622
2009	తానేటి వనిత	టీడీపీ	చిగురుపల్లి ఉషా	కాంగ్రెస్	14653
2014	ముప్పిడి వెంకటేశ్వరరావు	టీడీపీ	తలారి వెంకట్రావు	వైసీపీ	11540
2019	తలారి వెంకట్రావు	వైసీపీ	ముప్పిడి వెంకటేశ్వరరావు	టీడీపీ	37280



గోపాలపురం టీడీపీ కంచుకోట

• టీడీపీ ఆవిర్భావం తర్వాత 9 ఎన్నికలు • ఏడు సార్లు సైకిల్ హవా

ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన గోపాలపురంలో నియోజకవర్గంలో తొలి రెండు దశాబ్దాలు కాంగ్రెస్, స్వతంత్ర ఎమ్మెల్యేలు గెలుపొందారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాత నాలుగు దశాబ్దాల కాలంలో జరిగిన 9 ఎన్నికల్లో 7 సార్లు సైకిల్ హవా కొనసాగింది. 1962లో ఏర్పడిన నియోజకవర్గం ఆది నుంచి ఎస్సీ రిజర్వుడు స్థానమే. మొదటి ఇరవై ఏళ్లలో నియోజకవర్గ అభివృద్ధి లేదు. రోడ్లు, తాగునీరు లేవు, కనీసం వీధిలైట్లు కూడా వెలగని పరిస్థితి. 1984లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలకు తెలిసింది. మారుమూల పల్లెలకు సైతం రహదారులు, తాగునీటి కుళాయిలు, వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి మాటే లేదు. ప్రజలు విద్య, వైద్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో పొగాకు సాగు విస్తీర్ణం అధికం. బ్యారన్‌లో అగ్నిప్రమాదల సమయంలో రైతులు సర్వం కోల్పోతున్నారు. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుపై రైతుల విజ్ఞప్తిని పాలకులు పట్టించుకోలేదు. ఐదేళ్లుగా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న నియోజకవర్గంలో మరోసారి అభివృద్ధి సైకిల్ కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

- గోపాలపురం

గోపాలపురం నియోజకవర్గం ఏర్పడి నేటికి 62ఏళ్లు. 1962లో ఏర్పడిన గోపాలపురం నియోజకవర్గం ఆది నుంచి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం. 1962 నుంచి 78 వరకు ముగ్గురు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, ఒక స్వతంత్ర అభ్యర్థి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 20 ఏళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం. 1983లో టీడీపీ ఆవిర్భావం అనంతరం ఆ పార్టీ అప్రతిహతంగి విజయాలు సాధించింది. ఆ పార్టీ నుంచి మొదట కారుపాటి వివేకానంద ఎమ్మెల్యే కావడంతో ఎన్‌టీ రామారావు స్ఫూర్తితో మారుమూల పల్లెలకు సైతం రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో వీధిలైట్లు, ప్రజల దాహార్తి తీర్చేందుకు నీటి కుళాయిలు ఏర్పాటయ్యాయి. దీంతో గోపాలపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ప్రజలు వెన్నుదన్నుగా నిలిచారు. టీడీపీ ఆవిర్భావం అనంతరం జరిగిన 9 ఎన్నికల్లో 7 సార్లు ఆ పార్టీ వారే గెలుపొందారు. తెలుగుదేశం ఎమ్మెల్యేలు కనీస సౌకర్యాల కల్పనలో భాగంగా రహదారులు, పక్కా గృహాలు ఏర్పాటు చేశారు. ముళ్లపొదలతో ఉన్న బీడు భూములు నేడు పంట పొలాలతో సస్యశ్యామలం అయ్యాయి. గత ఐదేళ్లుగా తిరిగి అభివృద్ధి మందగించింది.

అందని ఉన్నత విద్య

ఏజెన్సీ మెట్ట ప్రాంతానికి ముఖ ద్వారంగా ఉన్న గోపాలపురం నియోజకవర్గంలో ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారింది. ఉన్నత విద్య అభ్యసించేందుకు కళాశాలలు లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు ఇంటర్మీడియట్ తర్వాత వలస పోవలిసిందే. ఉన్నత చదువు పూర్తి చేసినవారికి ఉపాధి అవకాశాలు లేక ఇళ్లకే పరిమితమై చేతి వృత్తులలో కొనసాగుతున్నారు.

అరకొర వైద్యం

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గోపాలపురం నియోజకవర్గంలో అరకొర వైద్య సదుపాయాలతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సరైన వైద్యం పొందాలంటే సుమారు 50 కిలోమీటర్లు దాటి రాజమహేంద్రవరం వెళ్లాల్సిందే. ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నా లేనట్టే. సూది ఉంటే దూది ఉండదు. అరకొర మందులు పూర్తి స్థాయిలో లేని సిబ్బంది కేవలం ఆకారానికే పరిమితమైన ఆసుపత్రుల్లో అందని అందని వైద్యంతో ఈ ప్రాంత ప్రజలు సరిపెట్టుకోవల్సి వస్తుంది. జాతీయ రహదారిపై ప్రమాదాల్లో క్షతగాత్రులను దూరప్రాంత ఆస్పత్రులకు తరలించాల్సిందే. నియోజకవర్గం ఏర్పడి సుమారు 62 ఏళ్లు అవుతున్నా పూర్తి స్థాయిలో వైద్యం అందని పరిస్థితి నెలకొంది.

పొగాకుకు పొంచివున్న అగ్గి ముప్పు

గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో వేలాది ఎకరాల్లో పొగాకు పంట సాగు చేస్తున్నారు. పొగాకు క్యూరింగ్ సమయాల్లో అగ్నిప్రమాదాలు జరగడం లక్షలాది రూపాయల పొగాకు బూడిదవడం ఏళ్ళ తరబడి జరుగుతూనే ఉంది. పార్టీలు, ప్రభుత్వాలు, పాలకులు మారుతున్న ఈ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కాకపోవడం రైతాంగానికి శాపంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి అగ్నిమాపక కేంద్రం మంజూరు అయ్యిదని ప్రచారం జరగడంతో ఈ ప్రాంత రైతాంగం ఊపిరి పీల్చుకున్నారు. కార్యరూపం దాల్చేసరికి ప్రభుత్వం మారింది. అనంతరం వైసీపీ ప్రభుత్వం మరోసారి దేవరపల్లి మండలం రామన్నపాలెంలో అగ్నిమాపక కేంద్రం నిర్మిస్తున్నామని చెప్పారు. స్థల సేకరణ పూర్తయిందని చెప్పడంతో రైతులు సంతోషించారు. తీరా చూస్తే అది ఎన్నికల ప్రచార ఆర్భాటమే తప్ప ఆచరణకు నోచుకోలేదు.


మాజీ ఎమ్మెల్యేలు కారుపాటి వివేకానంద, జొన్నకూటి బాబాజీరావు, తానేటి వనిత, ముప్పిడి వెంకటేశ్వరరావు, తలారి వెంకట్రావు (సిట్టింగ్)

చిన వెంకన్న ఆలయం జిల్లా మారింది

చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం ఏలూరు జిల్లాకు అప్పగించారు. ద్వారకా తిరుమల మండలం గోపాలపురం నియోజకవర్గం అయినప్పటికీ స్థానికుల విజ్ఞప్తి ఆందోళన మేరకు ఏలూరు జిల్లాలోనే కొనసాగిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ప్రసిద్ధి చెందిన ఆలయం కావడంతో చిరు వ్యాపారులు, ఇతర అనుబంధ వ్యాపారాలతో స్థానికులకు ఉపాధి అవకాశాలు బాగానే ఉన్నాయి. జిల్లా మార్పుతో నియోజకవర్గ ప్రాధాన్యం తగ్గిందనే చెప్పవచ్చు. వాస్తవంగా గోపాలపురం నియోజకవర్గ అభివృద్ధికి వనరుల కొరత తీవ్రం. ఈ ప్రాంతంలో పరిశ్రమలు లేవు, ఉపాధి అవకాశాలు లేవు. వ్యవసాయాధారిత ప్రాంతమైనా పామాయిల్, పొగాకు సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు. విద్యావకాశాలు కూడా అంతంతమాత్రం కావడంతో విద్య, ఉపాధి నిమిత్తం యువత వలసపోతున్నారు.

సీనియర్ ఓటర్

40 సార్లు ఓటేశా..



60 ఏళ్ల క్రితం తొలి ఓటు వేశా. ఇప్పటికి అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థలు కలిపి 40సార్లుకు పైగా ఓటుహక్కును వినియోగించా. నేడు రాజకీయాల్లో నీతిమంతులు, ప్రజా సేవకుల సంఖ్య తగ్గిపోయింది. ఓట్లు కొనడం, పదవుల్లోకి రావడం, వచ్చాక కోట్లు సంపాదించుకోవడం పరమావధిగా అయింది.

-మరిడి వీరరాఘవయ్య, చాట్రాయి మండలం

యువత ముందుకు రావాలి



50 ఏళ్ల క్రితం తొలి ఓటువేశా. అందరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. నేడు రాజకీయం వ్యాపారంగా మారింది. నిస్వార్థంగా ప్రజా సేవ చేసేవారు లేరు. ఈ పరిస్థితి మారాలంటే యువత రాజకీయాల్లోకి రావాలి. యువత భాగస్వామ్యంతోనే మార్పు సాధ్యం

సింగరాజు సీతామహాలక్ష్మి (75), చాట్రాయి

నేటి పాలకుల తీరే వేరు.



ఇప్పటికి 11సార్లు ఓటు వేశా. ఇప్పటి పాలకుల తీరే వారు. అధికారం కోసం మాత్రమే పథకాలు అమలు చేస్తున్నారు. రైతులకు ధరల స్థిరీకరణ, పథకం హామీలకే పరిమితం అవుతోంది. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. రైతులను ఆదుకునే ప్రభుత్వానికి ఓటువేస్తా.

గుడివాడ వెంకటేశ్వరరావు, ముసునూరు,

అప్పుల ఊబిలో రాష్ట్రం



ప్రస్తుత పాలకులు అధికారం కోసం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించారు. ఓట్లుకోసం రాష్ట్రాన్ని కొల్లగొట్టారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రం మరింత అధ్వానంగా తయారవుతుంది. రాష్ట్ర ఆదాయం పెంచే ప్రభుత్వం కావాలి. సంక్షేమం, అభివృద్ధి బ్యాలెన్స్ చేసుకుంటూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలి.

రేగుల గాంధీ, గోగులంపాడు

ఇప్పుడు అంతా ఆర్భాటమే



1962 సాధారణ ఎన్నికల్లో తొలి ఓటు వేశాను. ఇప్పటి వరకు 13 సార్లు ఓటు వేశాను. అప్పట్లో గ్రామాల్లో గోడలపై అభ్యర్థి పేరు, ఎన్నికల గుర్తు రాసి, రిక్షాపై మైక్ ప్రచారం సాదాసీదాగా చేసేవారు. ప్రలోభాలు ఉండేవి కావు. ఇప్పుడు అంతా ఆర్భాటం పెరిగిపోయింది. అప్పట్లో అభ్యర్థి ఒక్కసారి కనిపిస్తే గొప్ప.

పుప్పాల వీర నాగేశ్వరమ్మ, ముదినేపల్లి

స్థానిక సమస్యలు పరిష్కరించాలి



రాష్ట్రాభివృద్ధితో పాటు స్థానిక సమస్యలు పరిష్కారానికి కృషిచేసే అభ్యర్థికే ఓటువేస్తా. నియోజకవర్గంలో అనేక సమస్యలు పరిష్కారం కాక ఇప్పటికి ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయి. నేను 1978 నుంచి ఓటువేస్తున్నాను, నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. అభివృద్ధి చేసే వారికే ఓటు.

కాండ్రేగుల చెన్నారావు, చింతలపూడి

చిరు వ్యాపారులపై జులుం



» వైసీపీకి మద్దతు ఇవ్వాల్సిందే.. » లేకుంటే దుకాణాలు ఖాళీ చేయాలి
» జిల్లాలో రోడ్డు పక్కన వ్యాపారులకు అధికార పార్టీ బెదిరింపులు

పాలకొల్లు, మే 5 : ఉమ్మడి జిల్లాలోని పాలకొల్లు సహా పలు నియోజక వర్గాలలో ఫుట్‌పాత్ వ్యాపారులు, రోడ్డు పక్కన వ్యాపారులపై అధికార పార్టీ నేతలు జులుం ప్రదర్శిస్తున్నారు. కొన్ని రోజులుగా వైసీపీ నాయకుల నుండి బెదిరింపులు వస్తున్నాయని పలువురు వ్యాపారులు వాపోతున్నారు. వ్యాపార సంఘాలు సమావేశమై మా అభ్యర్థికి మద్దతుగా ప్రకటనలు ఇవ్వాలని హెచ్చరిస్తున్నట్టు పలువురు ఫుట్‌పాత్ వ్యాపారులు చెబుతున్నారు. తమకు రాజకీయపార్టీలతో సంబంధం లేదని, రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకంటూ జీవనోపాధి పొందుతున్నామని చెప్పినా అధికార పార్టీ నేతలు పలువురు బెదిరింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీ జెండా మోయకుంటే ఎన్నికల అనంతరం వ్యాపారాలను చేయనిచ్చేది లేదని, తమ పార్టీయే అధికారంలోకి వస్తుందని హెచ్చరిస్తున్నట్టు పాలకొల్లులోని ఒక చిరు వ్యాపారి తెలిపారు. గతంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు వచ్చినప్పుడు పోలీసులు మాత్రమే తమను హెచ్చరించే వారని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని పోలీసులు సూచించే వారని, ఇప్పుడు అధికార పార్టీకి చెందిన కొందరు దాదా గిరి చేస్తూ బెదిరిస్తున్నారని పలువురు చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమకు ఒరిగేది ఏమీ లేదని, ముఖ్యంగా గత కొన్ని రోజులుగా అధికార పార్టీ నాయకులు బెదిరింపులు పెరిగిపోవడంతో ఇప్పుడు అవసరమైతే తాను సైతం పార్టీ జెండా పట్టి తెలుగుదేశానికే మద్దతు ఇస్తామని మరో చిరు వ్యాపారి చెప్పారు. జిల్లాలోని ఫుట్‌పాత్ వ్యాపారులు పలువురు స్థానిక సంస్థల అధికారులను కలిసి తమ గోడు చెప్పుకోవడానికి సమాయత్తం అవుతున్నట్టు తెలిసింది.

ఓటేసిన నూరేళ్ల తాతయ్య

ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగం



ముదినేపల్లి, మే 5: తీవ్ర అవస్థతతో మంచంలోనే ఉన్న శతాధిక వృద్ధుడు ఇంటి వద్ద ఓటు వినియోగించుకున్నాడు. ముదినేపల్లి మండలం చేవూరు గ్రామానికి చెందిన వల్లభనేని మాధవరావు (103) చాలా కాలంగా అస్వస్థతతో మంచానికే పరిమితమయ్యారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లే అవకాశం కూడ లేని పరిస్థితుల్లో ఇంటి నుంచే ఓటు అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఓటు హక్కుని వినియోగించుకోవడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈయన చేవూరు గ్రామపంచాయతీకి 1959లో తొలి సర్పంచ్‌గా, అనంతరం పీఏసీఎస్, పాల సొసైటీ చైర్మన్‌గా వ్యవహరించారు.

అవ్వ ఓటు మురిగిపోయింది..?

హోమ్ ఓటింగ్ సదుపాయం కోసం దరఖాస్తు చేసుకున్న అవ్వ ఓటు మురిగిపోయింది. ఇంటినుంచే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకుని అనుమతి పొందిన 85 ఏండ్ల వయస్సు పైబడిన ఆమె ఓటు వేసేందుకు ఆసక్తి చూపలేదు. దీనితో ప్రస్తుత ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని కోల్పోయింది. పేరూరు గ్రామానికి చెందిన వీర్ల అంకమ్మ (88)తో ఇంటి వద్ద ఓటు వేయించేందుకు అధికారుల బృందం ఈనెల 3, 4 తేదీల్లో ప్రయత్నించారు. ఓటింగ్ సమయంలో పరిణామాలు, వివిధ కారణాలతో ఆమె ఓటు వేయలేదు. అధికారులు నోటీసులు జారీ చేసి ఆమె ఓటును రద్దు చేశారు. దీంతో ఈనెల 13న జరిగే పోలింగ్‌లో పాల్గొని ఓటు వేసే అవకాశం కూడా లేదు. హోమ్ ఓటింగ్‌లో అనుమతి పొంది ఓటు వేయకపోతే పోలింగ్ కేంద్రంలో ఓటువేసే అవకాశం ఉండదని ఆర్వో తెలిపారు.

అభ్యర్థుల ఎదురుచూపులు

వ్యవసాయ పనుల్లో రైతులు, కూలీలు
ఓట్లు అభ్యర్థించేందుకు నేతల పాట్లు


ధాన్యం మాసూళ్ల పనుల్లో వ్యవసాయ కూలీలు

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులకు పెద్ద చిక్కు వచ్చి పడింది. ప్రధాన పార్టీల అభ్యర్థులపై వ్యవసాయ పనుల ప్రభావం గట్టిగానే ఉంది. పనులకు వెళ్లిన వారికి సాయంత్రం వరకు గ్రామాల్లో అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. వ్యవసాయ కూలీలు వరికోతలు, ధాన్యం మాసూళ్ల పనులకు వేకువజామున వెళుతున్నారు. సాయంత్రం ఇంటికి తిరిగి రావడంతో అభ్యర్థులు సాయంత్రం వేళ ప్రచారం చేసుకుంటున్నారు. ఏలూరు రూరల్ మండలం మల్కాపురం, చొదిమెళ్ళ, చాటపర్రు, జాలిపూడి పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరోపక్క అభ్యర్థులను వేసవి ఎండలు భయపెడుతున్నా గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ముందుకు కదులుతున్నారు. ప్రచారంలో పాల్గొనే వారికి చల్లటి మజ్జిగ, మంచినీళ్లతో పాటు శీతలపానీయాలు ఇచ్చి వచ్చిన వారి దాహార్తిని తీరుస్తున్నారు. మొత్తం మీద మేలో ఎన్నికలు ఆటు అభ్యర్థులకు, ఇటు ప్రచారం కోసం వెళ్లే వారికి అగ్నిపరీక్ష అని చెప్పక తప్పదు.

- ఏలూరు రూరల్

ఎన్నికల చిత్రం

ఎన్నికల బరిలో అభ్యర్థులు వినూత్న రితీలో ప్రచారం చేస్తున్నారు. దైవ ప్రార్థనలు చేస్తున్నారు. పాలకొల్లు రూరల్ ఉల్లంపర్రులో టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు నిమ్మల రామానాయుడు, శ్రీనివాసవర్మ సైకిల్ తొక్కుతూ వెళ్లి ఓట్లు అభ్యర్థించచారు. తణుకు టీడీపీ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఇరగవరం చర్చిలో ప్రార్థన చేసి పాస్టర్ ఆశీర్వాదం తీసుకున్నారు.





నవతరం ఓటర్

మంచి నేతను ఎన్నుకుందాం

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, పేదరికం నిర్మూలనకు సరైన పరిపాలన చేయగల సమర్థవంతమైన నాయకత్వం కావాలని నూతనంగా ఓటు హక్కు పొందిన యువత కోరుతున్నారు. అలాంటి వారికే తమ ఓటు అని స్పషం చేస్తున్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు మంచి ప్రణాళికలు రూపొందించి అమలు చేయగల నాయకుడు అవసరమని కూడ పలువురు చెబుతున్నారు. కైకలూరు నియోజకవర్గ నూతన ఓటర్ల అభిప్రాయమిది.

- ముదినేపల్లి

అభివృద్ధి చేసేవారికే ఓటు



తొలిసారి ఓటు వేయబోతున్నా. నియోజకవర్గం అభివృద్ధి కోసం ఆలోచించే అభ్యర్థులను ఎన్నుకోవాలి. సమర్థత, సేవా భావం ఉన్న వారిని గెలిపించుకుంటేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించగలరన్న నమ్మకం కలిగిన అభ్యర్థులకి ఓటు వేద్దాం.

మీసాల నాగ భవానీ శంకర్, ముదినేపల్లి

ప్రలోభాలు వద్దు



ఎన్నికల్లో ధన ప్రభావం తగ్గాలి. ఓటర్లను ప్రలోభ పెట్టడం రాజకీయ నాయకులు మానుకోవాలి. యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రలోభాలకు ఓటర్లు గురి కాకూడదు. మంచి ఆశయాలు కలిగిన పార్టీలకు నాయకులకు యువత మద్దతునివ్వాలి.

మేలిమి భాను చంద్, శ్రీహరిపురం

సమర్థ నాయకుడికే ఓటు



ఎన్నికల్లో ఓటర్లు చైతన్యవంతంగా వ్యవహరించాలి. యువత తమ భవిష్యత్‌కు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించ గల సత్తా, సమర్థత కలిగిన అభ్యర్థులను ఎన్నుకోవాలి. నూతనంగా ఓటు పొందిన యువత నవ శకానికి నాంది పలకాలి. ఓటుతో మన భవిష్యత్ మనమే తీర్చిదిద్దుకోవచ్చు.

పరిశె చైతన్య, తేరగూడెం, పేరూరు శివారు

మంచి నాయకుడు కావాలి



ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధి చేయగల సత్తా ఉన్న నాయకుడిని ఎన్నుకోవాలి. నేటి యువత భవిష్యత్ తరాలకు మేలు చేయడమే కాక ఆదర్శంగా నిలవాలి. ప్రస్తుత నాయకులు యువతకు మార్గదర్శకులుగా, స్ఫూర్తిగా నిలవాలి. ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలి.

మోషాణం ప్రేమ్ సింగ్, సింగరాయపాలెం

సంక్షేమం.. అభివృద్ధి కావాలి



సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేయాలి. ఉచిత పథకాల కంటే ఉపాధిఅవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిరుద్యోగ సమస్య పరిష్కారమైతే సంపద పేదల చేతుల్లోకి వెళుతుంది. ఓటర్లను ఆకర్షించే విధానం బదులు ప్రజల ఆర్థిక అభ్యున్నతికి నాయకులు కృషిచేయాలి.

వి.నారాయణరావు, తంగెళ్ళమూడి

ఇదీ సంగతి !

మందుబాబులకు మంచి రోజులు..!


ఉండిలో ప్రభుత్వ మద్యం షాపు వద్ద బారుల తీరిన మందుబాబులు

ఎన్నికల వేళ మందుబాబులకు గిరాకీ బావుంది. రోజువారి కూలీ పనులు చేసుకుని సాయంత్రం వేళ ప్రభుత్వ మద్యం షాపుల వద్దకు వెళ్లి ఓ క్వార్టర్ కొనుక్కుని వెళ్లేవారు. ఇప్పుడు ఎన్నికలు వారికి కలిసి వచ్చాయి. పనులు ఎగ్గొట్టి ఏదో పార్టీకి ప్రచారానికి వెళితే వారిచ్చే సొమ్ముతో వేళాపాళా లేకుండా మందేస్తున్నారు. ఆయా పార్టీలకు చెందిన వారితో ప్రచారానికి వెళ్లి భోజనం చేసి సాయంత్రం మద్యంషాపుల ముందు వాలిపోతున్నారు. ఈ పార్టీ ఆ పార్టీ అనేమీ లేదు.. ఎవరు డబ్బులు ఎక్కువ ఇస్తే వారితో ప్రచారానికి వెళుతున్నారు. మద్యం షాపులు కూడా రోజు హౌస్ ఫుల్‌తో అమ్మకాలు సాగుతున్నాయి.

- ఉండి

ఎట్టెట్టా..!

ఒక వారం వరకు ఖాళీ లేదండీ !



బాబూ రేపు పనుంది వస్తావా.. అని అడిగితే ఎవరూ ముందుకు రావడం లేదు.. మరో వారం రోజుల వరకు అడగొద్దు.. మాకు పని ఉందిలే..? ఇదీ పట్టణం, గ్రామాల్లో వినిపిస్తున్న మాట..కులీలంతా బిజీ అయిపోయారు. ఎన్నికల వేళ వారికి కాళ్లనిండా పని దొరికింది. ప్రచారంలో తిరుగుతూ రోజు కూలి సంపాదించేస్తున్నారు. పనికి వెళితే ఏం వస్తుంది.. ఎండలో మాడిపోవడం తప్ప అనుకుంటూ ప్రచారానికి వెళ్లిపోతున్నారు. రూ.500, మద్యం సీసా, భోజనం పెట్టిమరీ ప్రచారాలకు తీసుకెళుతున్నారు. వేసవి కావడంతో కార్యకర్తలు ఎవరూ పెద్దగా రాకపోవడంతో ఇలా చేస్తున్నారు. ఒకరోజు ఒక పా ర్టీలో.. మరో రోజు ఇంకో పార్టీలో కనిపిస్తూ ఓటర్లను అయోమయంలో పడేస్తున్నారు.

- ఆకివీడు

ఎలక్షన్.. అటెన్షన్

బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడితే జైలుకే...



ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాన్ని స్వాధీనం చేసుకోవడం, అధికారులను బెదిరించి బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలు స్వాధీనం చేసుకోవడాన్ని బూత్ క్యాప్చరింగ్ అంటారు. ఈవీఎంలు ధ్వంసం చేయడం, విరగ్గొట్టడం, ఎన్నికల గుర్తులపై సిరా పొయ్యడం వంటి విధానాలు ఇందులో భాగమే. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను భయపెట్టడం, పోలింగ్‌ను అడ్డుకోవడం నేరం. ప్రభుత్వ సిబ్బంది ఇలాంటివి చేస్తే ఐసీసీ 1951 సెక్షన్ 135ఏ, 136 ప్రకారం మూడు నుంచి 5 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు జరిమాన విధించే అవకాశం ఉంటుంది. ఇతరులు అయితే 1 నుంచి 3 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తారు.

-గణపవరం

ఓటు వేసే ముందు..!



ఎన్నికలకు మరో వారం రోజులు మాత్రమే సమయం ఉంది. ఓటు వేసేందుకు వెళ్లే ఓటరు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. తమతో ఏమేం తీసుకెళ్లాలన్న అయోమయం ఓటర్లలో ఉంటుంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పోలింగ్ స్లిప్పులను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. ఈ స్లిప్పుతో పాటు ఓటు వేసేందుకు వెళ్లే వ్యక్తి వద్ద ఫొటోతో కూడిన గుర్తింపు కార్డు ఖచ్చితంగా ఉండాలి. ఎన్నికల సంఘం గుర్తించిన దిగువ పేర్కొన్న గుర్తింపుకార్డుల్లో ఏ ఒక్కటైనా మీ వద్ద ఉండాల్సిందే. ఓటరు కార్డు లేకపోతే ఆధార్ కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు, బ్యాంక్ లేదా పోస్టాఫీసు జారీ చేసిన ఫొటో ఉన్న పాస్‌బుక్, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, లేదా ప్రభుత్వ రంగ సంస్థలు పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు ఆయా సంసంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు, కార్మిక శాఖ జారీచేసిన స్మార్ట్ కార్డు, ఆరోగ్యబీమా కార్డు, భారతీయ పాస్ పోర్ట్, ఫొటోతో పాటు ఉండే పెన్షన్ డాక్యుమెంట్ వీటిలో ఏదో ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపాల్సి ఉంది. పోలింగ్ బూత్‌లోకి వెళ్లేవారు సెల్‌ఫోన్‌లు, కెమెరాలు తీసుకెళ్లకూడదు. పోలింగ్ బూత్‌లో సెల్ఫీ దిగడం నిషేధం. ఇలా చేస్తే అరెస్ట్ చేస్తారు. మీరు వేసిన ఓటు కూడా లెక్కించరు. పోలింగ్ కేంద్రం వద్ద పార్టీల గుర్తులు, రంగులు కల్గిన దుస్తులను, టోపీలను ధరించకూడదు.ఓటు వేసే ముందు ఇవన్నీ సరిచూసుకోవాలి

- ద్వారకాతిరుమల

పాలిట్రిక్స్

మా ఓటు మీకే !



సార్వత్రిక ఎన్నికల వేళ గ్రామాల్లో విచిత్రమైన పరిస్థితి కనపడుతోంది. ఏ పార్టీ నాయకులు పిలిచినా ర్యాలీలు, ప్రచారానికి మద్దతుగా తిరుగుతున్నారు. గతంలో అయితే పార్టీకి మద్దతు ప్రకటిస్తే ఆ పార్టీతోనే ఉండేవారు. ఎన్నికల్లో శిబిరాల్లో ఉత్సాహంగా ఉండి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేసేవారు. ఓటింగ్ రోజున తనకు నచ్చినవారికి ఓటు వేసేవారు. ఇప్పుడు అభ్యర్థులు గ్రామాల్లో పర్యటిస్తున్న సమయాల్లో ప్రచారానికి రావాలని కోరుతున్నారు. దీంతో ఆ పార్టీ నాయకుల ఆహ్వానాన్ని మన్నించి కొంతమంది నాయకుల ప్రచారాలకు మద్దతు పలికి వారితో ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఇలా ఇరుపార్టీల వైపు తిరిగే వారి వల్ల అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. సర్వేలు చేసే వారు కూడా ఇటువంటి వారిని ప్రశ్నిస్తే " పార్టీలది ఏముంది ఎన్నికల రోజు మాకు ఇష్టవచ్చిన వారికి ఓటు వేస్తాం. అంతవరకు ఏ పార్టీ నాయకులకు చెడ్డ కాకూడదు కదా" అని సమాధానం చెబుతున్నారు.

- గణపవరం



ఏలూరు ఎవరిదో ?



- ఒకరేమో తలపండిన రాజకీయ కురువృద్ధునికి స్వయానా అల్లుడు. టీటీడీ బోర్డు చైర్మన్‌గా వ్యవహరించిన నేతకు తనయుడు. పోలవరం ప్రాజెక్టు పనుల్లో ఒకింత అనుభవం ఉన్న వ్యక్తి. యువరక్తం ఉరకలు వేస్తుండగా తొలిసారిగా ఏలూరు లోక్‌సభ రాజకీయ రణరంగంలోకి కూటమి పక్షాన టీడీపీ బలపరిచిన తెలుగుదేశం అభ్యర్థిగా పుట్టా మహేష్ యాదవ్ నిలిచారు.
- మరొకరు బీసీవర్గాల ప్రతినిధిగా వైసీపీలో ముఖ్యనేతగా, రాష్ట్రమంత్రిగా ఉన్న నేతకు స్వయాన తనయుడు. రాజకీయాలు అంటే అలావోక కాదని తన తండ్రి పక్షాన రాజకీయాల్లో, ఎన్నికల్లో బాసటగా ఉన్న యువనేత. తండ్రి కారుమూరి నాగేశ్వరరావు అసెంబ్లీకి పోటీ పడుతుండగా ఆయన తనయుడు సునీల్ కుమార్ వైసీపీ నుంచి ఏలూరు లోక్‌సభకు పోటీ పడుతున్నారు.
- ఇన్నాళ్లు ఉనికికోసం ఆరాట పడిన కాంగ్రెస్‌లో అందునా ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికల బరిలో తొలిసారిగా మహిళా అభ్యర్థి కావూరి లావణ్య పోటీ పడుతున్నారు. కేవలం కుటుంబనేపథ్యం, పార్టీపై నిబద్ధతతోనే ఈ ఎన్నికల్లో మిగతా అభ్యర్థులతో పోరాటానికి దిగారు. వీరితో పాటు బరిలో మరో 11 మంది అభ్యర్థులు నిలిచారు.

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు లోక్‌సభ స్థానంలో నువ్వానేనా అన్నట్లుగా ప్రచారం సాగుతోంది. అన్నివర్గాలు చేరువ కావడానికి చేయని ప్రయత్నం లేదు. పోలవరం ప్రాజెక్టు ప్రధాన ప్రచార అస్త్రంగా నిలిచిపోయిన చింతలపూడి ఎత్తిపోతల వాగ్దాణంగా నియోజకవర్గాల్లో పూర్తికాని పనులు అమలు కాని హామీలు అస్త్రాలుగా లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ప్రచారంలో హోరెత్తుతున్నాయి. ఏలూరు లోక్‌సభ స్థానానికి పోటీపడుతున్న వారిలో రాజకీయ నేపథ్యం కలిగిన వారితో పాటు మిగతా వారంతా వివిధ వృత్తుల్లో రాణించిన వారు. వీరంతా ఇండిపెండెంట్‌గా రంగంలో ఉన్నారు. ఇప్పటికే దఫాలవారీగా పట్టణాలు, నగరాలు, పల్లెల్లో ప్రచారం పూర్తి చేసుకుని పోలింగ్ దిశగా సాగుతున్నారు.వీరందరిలో బలమెంత? బలహీనత ఏంటి? ఏది ప్రచారాస్త్రం? మరేది ప్రజాకర్షణ ? గెలుపు ఎవరిదనే దానిపైనే ప్రజల్లో అత్యంత ఉత్కంఠ అయితే నెలకొంది. తమ తీర్పు ఇచ్చేందుకు ఓటర్లు ఈనెల 13న సిద్ధమవు తున్నారు. ఇప్పటిదాకా ఏలూరు లోక్‌సభలో సాగిన రాజకీయ ప్రచార సరళిపైన అభ్యర్థుల తీరుపైన ఒక విశ్లేషణ.

ఓటర్లను తాకిన యువ కెరటం

పోలవరం ప్రాజెక్టే ప్రధానాస్త్రం

మిగిలిపోయిన పనులపైనే పదునెక్కిన ఆరోపణలు

కూటమి అభ్యర్థి మహేష్ యాదవ్ ప్రచారాస్త్రాలు

వైసీపీ అభ్యర్థి సునీల్‌కు సవాళ్ళు ఎన్నో

కాంగ్రెస్, ఇండిపెండెంట్ల హోరా హోరీ ప్రచారం

గెలుపు గుర్రాన్ని అధిరోహించేందుకు ఎన్నో తంటాలు

ఏలూరు లోక్‌సభ స్థానంపై విశ్లేషణ



పొలిటికల్ రివ్యూ

కాంగ్రెస్ పక్షాన లావణ్య పోరాటం



లోక్‌సభ అభ్యర్థిగా రంగంలోకి దిగిన కారుమూరి లావణ్య ఏలూరు లోక్‌సభ స్థానంలో ప్రచారంలో ఒకింత దూసుకుపోతూనే ఉన్నారు. రాజ కీయాల్లో ప్రత్యక్షంగా ఇప్పటిదాకా లేకపోయినా తొలిసారిగా లోక్‌సభ స్థానానికి పోటీ పడుతున్నారు. కాస్తంత రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి లావణ్య వచ్చారు. పీసీసీ చీఫ్ షర్మిల ఇచ్చిన స్ఫూర్తితో ఆమె వివిధ నియోజక వర్గాల్లో ప్రచారాన్ని హోరెత్తించేటట్లుగా ప్రయత్నం చేస్తున్నారు. ముంపు గ్రామాల్లోనూ, ఇతర నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ నేతలను కలుపుకుపోతూ ముందుకు సాగుతున్నారు. తనను గెలిపిస్తే ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి పరుగులు తీయిస్తానని హామీ ఇస్తున్నారు. కాంగ్రెస్ పక్షాన అసెంబ్లీ అభ్యర్థులుగా ఉన్నవారితో సమన్వయం చేసుకుని కొంతలో కొంత ముందుకు వెళుతున్నారు.

మహేష్ యాదవ్ బలమెంత ?



ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో కూటమిపక్షాన ఎవరిని రంగంలోకి దింపాలనే దానిపై సుదీర్ఘకసరత్తు సాగింది. రాష్ట్ర రాజకీయాల్లో సీనియర్, మాజీమంత్రి యనమల రామకృష్ణుడి అల్లుడు, విద్యావంతుడు పుట్టా మహేష్ యాదవ్‌ను కూటమి పక్షాన రంగంలోకి దించారు. ఆదిలో మహేష్‌పై నాన్‌లోకల్ ముద్ర వేసేందుకు వైసీపీ ప్రయత్నించింది. యాదవ్ తేరుకుని రాజకీయ అస్త్రశస్త్రాలను సంధిస్తూ వచ్చారు. ఇన్నాళ్ళు.. ఈ ఐదేళ్ల మీరంతా ఉండి ఏలూరు లోక్‌సభ స్థానంలో ఏం అభివృద్ధి చేశారు ? పోలవరం ఎందుకు కట్టలేదు ? చింతలపూడిని ఎందుకు పూర్తి చేయలేక పోయారు ? తాగు, సాగు నీరును పూర్తిగా రప్పించలేకపోయిందెవరు ? మీరు కాదా ? అంటూ వైసీపీపై స్ట్రాంగ్ కౌంటర్ ఇవ్వడంతో లోకల్ వివాదం కాస్త తొలిగిపోయింది. దెందులూరు నియోజకవర్గంలో కూటమి పక్షాన మార్పులు, చేర్పులు చేసేందుకు ప్రయత్నాలు జరిగినా అక్కడ టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ పక్షానే మహేష్ నిలబడ్డారు. అదిష్టానాన్ని ఒప్పించి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభాకర్‌కే దెందులూరు ఇచ్చి తీరాల్సిందేనని పట్టుబట్టి చివరికి అదీ సాధించారు. నూజివీడు నియోజక వర్గంలో పార్టీ అభ్యర్థిగా కొలుసు పార్థసారథి రంగంలో ఉండగా, ఆయనపై రెబల్ అభ్యర్థిగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కొన్నాళ్ళపాటు టెన్షన్ పెట్టారు.ఈ సమస్యను కూడా స్వల్ప వ్యవధిలోనే మహేష్ కొలిక్కి తేగలిగారు. ఈ రెండు చోట్ల మహేష్‌యాదవ్ చురుగ్గా వ్యవహరించటం పార్టీ లోనూ, ప్రజల్లోనూ ఆయన ఇమేజ్ పెంచేలా చేసింది. ఏలూరు లోక్‌సభ స్థానంలో పోలవరం నుంచి జనసేన అభ్యరి చిర్రి బాలరాజు, మిగతా వర్గాల మధ్య అంతరం ఏర్పడినప్పుడు కూడా చంద్రబాబు ఆదేశాల మేరకు చొరవ తీసుకొని అందరినీ ఒకటి చేయగలిగారు. ఏలూరు లోక్‌సభలో కూటమి పక్షాన తెలుగుదేశం దెందులూరు, ఏలూరు, చింతలపూడి, నూజివీడు నియోజక వర్గాల్లో పోటీ పడు తుండగా, కైకలూరులో బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, పోలవరం, ఉంగుటూరు నియోజక వర్గాల్లో జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు పోటీ పడుతున్నారు.

ప్లస్ పాయింట్లు

- విద్యావంతుడు, రాజకీయ కుటుంబ నేపథ్యం
- తానేం చేయదలచుకున్న పనులపై విస్తృత ప్రచారం..ఏలూరు స్మార్ట్‌సిటీ, చింతలపూడి ఎత్తిపోతల పూర్తి, మామిడి, పామాయిల్, మొక్కజొన్న వరి పంటలపై రైతులకు అండగా ఉండటం వంటి హామీలతో పైచేయి.
- కీలకమైన కొల్లేరు కాంటూరు పరిధి కుదింపులో కీలకంగా వ్యవహరిస్తానంటూ ఇచ్చిన హామీ హైలెట్.
- జనసేనాని పవన్‌కల్యాణ్‌తో కలిసి నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కింద రక్షణనిధికి కోటిరూపాయలు విరాళం ప్రకటించడంతో మహేష్‌యాదవ్ నిర్వా సితుల్లో తనదైన ముద్ర వేసుకోగలిగారు.
- తెలుగుదేశం అధినేత చంద్రబాబు నూజివీడు, దెందు లూరులోనూ జనసేన అధిపతి పవన్‌కల్యాణ్, కైకలూరు, కొయ్యలగూడెం, గణపవరంలోనూ విస్తృతంగా పర్యటించడం కూడా కలిసొచ్చేదిగానే అంచనా వేస్తున్నారు.
- ఏలూరు లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటిదాకా పోటీచేసిన అభ్యర్థుల కంటే మహేష్ యాదవ్ ఒక్కరే పిన్న వయస్కుడు కావడం కూడా యువతను ఆకట్టుకు నేందుకు ప్రత్యేకంగా కలిసొచ్చింది.

వైసీపీలో సునీల్ కుమార్ బలగం ఎంత ?



వైసీపీ నుంచి ఏలూరులోక్‌సభ అభ్యర్థిగా కారుమూరు సునీల్‌కుమార్ రంగంలో ఉన్నారు. రాష్ట్రమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు సునీల్ కుమార్ తనయుడు. బీసీవర్గాల ప్రతినిధులుగా అటు టీడీపీ పక్షాన మహేష్ యాదవ్, ఇటు వైపీసీ పక్షాన సునీల్‌కుమార్ ఇద్దరు రంగంలో ఉండటంతో ఏలూరు లోక్‌సభలో బీసీ వార్ జరుగుతోంది. ఈ వార్‌లో ఎవరిది పైచేయి అనేది ఎవరంతటి వారుగా తమదేననే ధీమాతో ఉన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో పార్టీలో నెలకొన్న విభేదాలు సునీల్ కుమార్‌కు తలనొప్పి గానే ఉన్నాయి. సిట్టింగ్ ఎంపీ కోటగిరి శ్రీధర్ అనుకూల వర్గం కొన్నిసార్లు అలగటం, సీనియర్లు ఇంకొందరు వ్యక్తిగతంగా వ్యవహరించటం వీటన్నింటిని ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ తండ్రి, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పరిష్కరించాల్సి వచ్చింది. తన సమీప ప్రత్యర్థి మహేష్ యాదవ్ ఒకవైపు అందర్ని కలుపుకుపోతూ దూసుకు వెళ్ళటం, విమర్శలతో సవాళ్ళు విసరటం చేస్తుంటే సునీల్‌కుమార్ మాత్రం ఈ విషయంలో వెనుకబడ్డారు. బీసీవర్గాల నుంచి సంపూర్ణ మద్దతు దక్కుతుందని భావిస్తున్నా నియోజకవర్గాల్లో మాత్రం బీసీలతో పాటు మిగతా వర్గాల నుంచి అనుకున్నంతగా మద్దతు కూడగట్టుకోలేకపోయారన్న విమర్శలు పార్టీలో ఉన్నాయి. కేవలం పార్టీ మద్దతు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ప్రస్తుత అభ్యర్థులు మీదే సునీల్ పూర్తిగా ఆధారపడాల్సి వచ్చింది. పోలవరం ప్రాజెక్టుపై రైతు లను, ఇతర వర్గాలను పూర్తిగా ఆకట్టుకోకపోవడం, చింతలపూడి ఎత్తిపోతల వంటి పనులు పెండింగ్‌లో పడటం కూడా సునీల్‌కు మైనస్ పాయింట్లు అయ్యాయని అంచనా వేస్తున్నారు. కైకలూరు వంటి నియోజకవర్గాల్లోనూ బలీయంగా ఉన్న బీసీ ఓటర్లు పూర్తిగా తనవైపు తిప్పుకోవడానికి సునీల్ అభ్యర్థిపరంగా ముందుకు వెళ్ళలేకపోయారని ఇంకోవాదన.

ప్లస్ పాయింట్లు

- తన తండ్రి కారు మూరి నాగేశ్వరరావు మంత్రిగా ఉండటం పార్టీ శ్రేణులు ప్రచారంలో కలిసి రావడం
- సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ప్రస్తుత అభ్యర్థులు వ్యవహారాన్ని అంతటిని చక్కపెట్టడం
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు, దెందులూరులో పర్యటించడం కలిసొచ్చేదిగా భావిస్తున్నారు.

సెల్ఫీ విత్ లోకేశ్






టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏలూరులో ఆదివారం ప్రజాగళంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా'హలో లోకేశ్' కార్యక్రమం నిర్వహించారు. యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని ఆయనతో ఇలా సెల్ఫీలు దిగారు.. కొంతమంది తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు..

రాష్ట్రాభివృద్ధి కోసమే కూటమి

కొవ్వూరులో కూటమి అభ్యర్థుల రోడ్‌షో


రోడ్డుషోలో పురందేశ్వరి, ముప్పిడి, నారా రోహిత్

కొవ్వూరు, మే 5 : రాష్ట్రాభివృద్ధి కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులుగా మీ ముందుకు వస్తున్నామని ఆశీర్వదించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కూటమి పార్లమెంటు అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కొవ్వూరు పట్టణ, మండలంలో ఆదివారం కూటమి అభ్యర్థులు రోడ్ షో నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి, సినీ హీరో నారా రోహిత్‌తో కలిసి కొవ్వూరు పట్టణం, వేములూరు, తోగుమ్మి, వాడపల్లి, బంగారంపేట గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. కొవ్వూరు గ్రామదేవత కొవ్వూరమ్మ ఆలయంలో పూజలు చేసి అనంతరం రోడ్‌షో ప్రారంభించారు.గ్రామాల్లో ప్రజలు, మహిళలు హారతులు ఇచ్చారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై, పార్లమెంటు అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓట్లువేసి గెలిపించాలన్నారు. పురందేశ్వరి, నారా రోహిత్‌లను ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, విజయలక్ష్మి దంపతులు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, పరిమి రాధాకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, అర్లిల్లి రామకృష్ణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, జొన్నలగడ్డ రాధారాణి, డేగల రాము, సుంకర సత్తిబాబు, బూసి బెనర్జి, పోతురాజు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీనివాసరావు, మద్దుల సత్యనారాయణ, వీర రాఘవులు, తాడిమళ్ళ విజయవాణి, పిక్కి నాగేంద్ర, పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్‌కు కూటమి ప్రభుత్వం అవసరం : అచ్చిబాబు


టీడీపీలో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పెండ్యాల అచ్చిబాబు

రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమి ప్రభుత్వ ఏర్పాటు అవసరం ఎంతైనా ఉందని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు అన్నారు. కొవ్వూరు పార్టీ కార్యాలయంలో కుమారదేవం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కనిగంటి సాంబయ్య ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 10 మంది ఎస్సీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి అచ్చిబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కంటమణి రామకృష్ణారావు, మండలాధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

2700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


ఏలూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, మే 5 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ఎస్ఈబీ బృందాలు దాడులు నిర్వహించాయి. ఆదివారం జిల్లాలోని చింతలపూడి, భీమడోలు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ అధికారులు, చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీ, విక్రయ దారులపై 3 కేసులు నమోదులు చేసి వారి నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 2700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 2 కేసులు నమోదు చేశారు. డ్యూటీపెయిడ్ లిక్కర్ కల్గి ఉన్న వారిపై 9 కేసులు నమోదు చేసి 9.43 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 14 కేసులలో 11 మంది వ్యక్తులను అరెస్టు చేశారు. మిగిలిన వారిని అరెస్టు చేయాల్సి ఉంది. ఏడు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు తెలిపారు.


బెల్లపుఊటను పారబోస్తున్న అధికారులు

వాహనాల తనిఖీలు

ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లజాము వరకూ జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. నాటుసారా, నగదు, మద్యం, గంజాయి రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. అంతేకాకుండా వివిధ నగరాలు, పట్టణాలు, వివిధ ప్రాంతాల్లో ఏటీఎంలు, మసీదులను గస్తీ పోలీసులు పరిశీలన చేశారు. లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలోని అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించారు. నేరాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టారు.

ఏలూరు రూపురేఖలు మారుస్తా



- రౌడీయిజం అంతుతేలుస్తా
- అందరికీ ఉపాధి, మౌలిక సదుపాయాలు
- కొత్త పరిశ్రమలు వచ్చేలా కార్యాచరణ
- ప్రజా మద్దతుతో నా గెలుపు ఖాయం
- ఆంధ్రజ్యోతితో టీడీపీ అభ్యర్థి బడేటి చంటి

ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి : 'ఏలూరు ప్రజలతో మూడుతరాల అనుబంధం ఉంది. ప్రతివారితో కలిసిమెలిసి పనిచేశాం. వారి కష్టనష్టాల్లో పాలుపంచుకున్నాం. నగరంపై సంపూర్ణ అవగాహన ఉంది. రాజకీయ నాయకులు అంటే ఇంట్లో కూర్చొని ఆదేశాలు ఇచ్చేవాడు కాదనేదే మా అందరి పద్ధతి. నిత్యం జనంతో మమేకం కావడం, వారి బాగోగులను పట్టించుకోవడం, నగర అభివృద్ధి కోసం పక్కాప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లడం మా అసలు, సిసలైన లక్ష్యం. సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందరికి అందేలా చేయాలనే తపన మొదటి నుంచి మా కుటుంబానికి ఉంది. ఇప్పుడు నా ఉద్దేశం కూడా నూటికి నూరుపాళ్ళు ఇదే.. నగరాభివృద్ధిలో మా తండ్రి, తాత, సోదరుడు పాత్ర ఎంతో ఉంది. మొదటి నుంచి నగరాభివృద్ధి కోసం నిత్యం శ్రమించిన కుటుంబం మాది' అని ఏలూరు తెలుగుదేశం అసెంబ్లీ అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

• జూట్‌మిల్లు మూతకు కారణం ఎవరు ?

జూట్ మిల్లు మూసివేత సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ళ నాని హయాంలోనే జరిగింది. సొంత ప్రయోజనాలు చూసుకున్నారే తప్ప వేల కుటుంబాల బాగోగులను పక్కన పెట్టారు. ప్రత్యేకంగా యాజమాన్యంతోను చర్చించలేదు. ఆపై వారితోనే కుమ్మక్కు అయ్యారు కూడా. ఇదెక్కడి న్యాయం? చిన్నతరహా పరిశ్రమలు, స్వయం ఉపాధికి ఎంపీ అభ్యర్థి పుట్టామహేష్ ఎంతో ఉత్సాహంతో ఉన్నారు. ఆయన సహకారంతో వీటిని రప్పిస్తా.

• మీకే ఎందుకు ఓటు వేయాలి ?

ఈ ప్రశ్నకు సానుకూలంగానే జనం స్పందిస్తున్నారు. గడిచిన ఐదేళ్ళల్లో ఏం చేశారో జనం స్వయంగా చూశారు. ఎక్కడికక్కడ నష్టపోయిన తీరు స్పష్టంగానే ఉంది. నేను టీడీపీ అభ్యర్థిగా రంగంలో ఉండి, ప్రచారానికి వెళుతుంటే సమస్యల ప్రస్తావన తెస్తున్నారు. అంటే సమస్య పరిష్కారానికి తగిన వ్యక్తిగా, నేతగా నన్ను గుర్తించినట్టే కదా. అందుకోసమే స్వచ్ఛందంగా ప్రజలే నా వెనుక నిలబడి మద్దతు ఇస్తున్నారు.

• అభ్యర్థిగా మీకున్న ఆలోచనలు ఏంటి?

ఏలూరు నగరాభివృద్ధికి మొదటినుంచి మా కుటుంబం కట్టుబడి ఉంది. నాకు కూడా పూర్తి అవగాహన ఉంది. ఏలూరు అభివృద్ధికి నా సొంతంగా ఓ మేనిఫెస్టో తయారు చేశా. విలీన గ్రామాల్లో తాగునీరు, రోడ్లు నిర్మించాలి. టిడ్కో గృహాలను పేదలకు పూర్తిగా అందజేయటం, అసంపూర్ణంగా మిగిలిన ఇళ్ల కాలనీని పూర్తి చేయటం. ఇంకోవైపు పెద్దాసుపత్రిలో సకల సౌకర్యాలు అందేలా మెరుగుపరుస్తా. డిగ్రీ కాలేజి ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం.

• యువతకు ఏం చేస్తారు ?

ఉద్యోగాలు యువతకు అత్యవసరం. ఏలూరులోని నగరంలో ఐటీహబ్ జోన్ ఏర్పాటు చేయాలనేదే నా కల. ఈ దిశగా ఎంపీ అభ్యర్థితో కలిసి నిర్ణయాలు తీసుకుంటాం. వేలాదిమంది యువతకు ఇక్కడ ఉపాధి లభించేలా మేము తీసుకునే చర్యల్లో దీనికే ప్రాధాన్యత ఇస్తాం. ఎందుకనంటే అమరావతి లేక ఉపాధిలేక యువత నిర్వీర్యంగా ఉంది.

• మధ్యతరగతికి భరోసా ఏంటి ?

ఏలూరు నగరంలో మధ్యతరగతి కుటుంబాలు లెక్కకు మించి ఉన్నాయి. వీరందరికి రోజువారి ఆదాయం లభించేలా చూడాలనేదే నా లక్ష్యం... ఆలోచన కూడా. స్టిచ్చింగ్ దగ్గర నుంచి తినుబండారాల అమ్మకం ఎక్కువగా ఉంటోందని, కేటరింగ్‌తో పాటు ఏ కుటుంబం ఏ అంశంతో ఉత్సాహంతో ఉందో ఆ దిశగానే ప్రోత్సహించి ఆదాయం పెరిగేలా చూస్తాం.

• రౌడీయిజం లేకుండా చేస్తాం ?

నగరంలో శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నదే నా మొదటి ప్రాధాన్యత. ఈ దిశగానే ఎక్కడా సెటిల్‌మెంట్ లేకుండా చేస్తా. నన్ను గెలిపిస్తే వెంటనే ఏలూరులో ఒక ప్రత్యేక అధికారిని నియమించేలా చూసి ఆయన ఆధ్వర్యంలోనే అరాచకాలను అణచివేయాలన్నది ఆలోచన. ఎక్కడా రౌడీయిజం, గ్రూపులు తెగబడటాన్ని సహించేది లేదన్నదే నా లక్ష్యం.

• ఈ ఐదేళ్ళల్లో ప్రభుత్వ వైఫల్యాలు ఏంటి ?

ఈ ఐదేళ్ళల్లో నగరాభివృద్ధి జరగలేదు. శనివారపుపేట ఫ్లైవోవర్ నిర్మాణం జరగలేదు. వీటికి తోడు మిగతా సమస్యలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అన్నింటికంటే మించి ఇప్పుడు ఎమ్మెల్యే ఎవ్వరికి అందుబాటులో ఉండడు.

• కార్పొరేషన్‌ను పట్టించుకుంటారా ?

ఏలూరు కార్పొరేషన్ రూపురేఖలు మార్చేలా చూస్తా. కార్పొరేషన్‌లో ప్రస్తుతం ఉన్న డివిజన్‌లను 70వరకు పెరిగేలా ప్రాధాన్యత ఇస్తాం. ఇప్పటికే నగరాభివృద్ధికి సీనియర్ల సలహాలను స్వీకరిస్తూనే ఉన్నా. అందరి అవగాహనతో ఏలూరును పదిమంది గుర్తించేస్థాయికి తేవాలన్నదే నా వ్యూహం. ప్రచారంలో ఎక్కడికి వెళ్ళినా ఆశీర్వదించారు. ఎంపీ అభ్యర్థి పుట్టామహేష్ సహకారం ఇప్పటికే ఉంది. ఆయన, నేను ఇద్దరం గెలిచి ఏలూరును అద్భుతంగా తీర్చిదిద్దాలన్నదే ఆశయం. కచ్చితంగా ఈ ఎన్నికల్లో ప్రజా విజయం సాధిస్తామనే నమ్మకం నూటికి నూరుశాతం ఉంది.




శ్రీచక్రవార్యుత్సవంలో స్వామి, అమ్మవార్లు, శ్రీచక్రపెరుమాళ్లు.. ధ్వజఅవరోహణ జరుపుతున్న అర్చకులు

నయనానందకరం.. శ్రీచక్రవార్యుత్సవం

ద్వారకాతిరుమల, మే 5 : శ్రీనివాసుని దివ్యకల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం లక్ష్మీపురం ఆలయంలో జరిగిన శ్రీచక్రవార్యుత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. పండితులు తమ శిరస్సులపై శ్రీచక్ర పెరుమాళ్లను ఉంచుకుని స్నానమాచరించారు. తరువాత చూర్ణోత్సవం, వసంతోత్సవం జరిపారు. ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లతో పాటు శ్రీచక్ర పెరుమాళ్లను ఒక వేదికపై ఉంచి అభిషేకించారు. ఆలయ యాగశాలలో శ్రీమహాపూర్ణాహుతి జరిపారు. రాత్రి ధ్వజావరోహణ జరిగింది.




శ్రీవారి చిత్రపటాలు అందుకుంటున్న సినీ నటుడు రోహిత్.. ఆర్చర్ జ్యోతిసురేఖ

శ్రీవారి సేవలో సినీనటుడు నారా రోహిత్

ద్వారకాతిరుమల, మే 5:చినవెంకన్నను సినీ నటుడు నారా రోహిత్ ఆదివారం ఉదయం దర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా ప్రాంగణంలో ప్రదక్షిణలు జరిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు.

విలువిద్య క్రీడాకారిణి సురేఖ పూజలు

ద్వారకాతిరుమలేశుని ఆలయాన్ని అంతర్జాతీయ ఆర్చర్, అర్జున్ అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖ ఆదివారం సందర్శించారు. కుటుంబంతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. పండితులు శ్రీవారి శేషవస్త్రాన్ని అందించి వేద ఆశీర్వచనాన్ని ఇచ్చారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించండి

ఏలూరు టుటౌన్, మే 5 : ప్రైవేటు పాఠశాలల సమస్యలను ఏ ఒక్కటీ జగన్ ప్రభుత్వంలో పరిష్కారం కాలేదని శ్రీశ్రీ విద్యాసంస్థల అధిపతి డాక్టరు ఎంబీఎస్ శర్మ అన్నారు. యువగళం సభలో నారా లోకేశ్‌కు ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం లోకేశ్ స్పందిస్తూ నెలరోజులు ఆగండి.. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కడియాల విజయలక్ష్మి, కోనేరు సురేష్‌బాబు, ఎల్.గిరిబాబు, కె.వినోద్‌కుమార్. జి.రవిశంకర్, వెంకటేశ్వరరావు, కె.మదన్‌మోహన్‌రాజు పాల్గొన్నారు.

అంజుమన్ సంస్థ సేవలు ప్రశంసనీయం

ఏలూరు రూరల్, మే 5:సహాయం కోరి వచ్చే ప్రతిఒక్కరికి సాయం అందించే అంజుమన్ సంస్థ సేవలు ప్రశంసనీయమని ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్.ఎమ్.ఆర్ పెదబాబు అన్నారు. పేద ముస్లింలు, ఇతర అన్నివర్గాల పేదల పిల్లలకు అంజుమన్ సంస్థ ద్వారా ప్రతి ఏడాది నిర్వహించే ఖత్నా (సున్తీ కార్యక్రమం) ఆదివారం అంజుమన్ హాల్లో జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లిం ప్రజలకు సాయం అందించేందుకు మాత్రమే అంజుమన్ సంస్థ ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా సుమారు 350 మంది పిల్లలకు ఖత్నా కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు రొట్టె, పాలుతో పాటు మూడు రోజులకు సరిపడా మందులు అందజేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎస్కే సులేమాన్, కార్యదర్శి, అమీర్‌జానీ, ఎమ్డీ ఇక్బాల్, వలీ, అస్లామ్, జహెల్, సిరాగ్, ఇస్మాయేల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడాలి

» ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు

ఉంగుటూరు, మే 5 : వైసీపీ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని ఉంగుటూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు కోరారు. ఆదివారం రాచూరు గ్రామంలో 'జనంలోకి ధర్మరాజు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోడ్డుపై ధాన్యం ఆరబెట్టుకున్న రైతును వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త వట్టి పవన్‌కుమార్, మందా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాచూరులో రైతులతో మాట్లాడుతున్న ధర్మరాజు

ఉత్సాహంగా మోటారు సైకిళ్ల ర్యాలీ

ఉంగుటూరు మండలంలో జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఆదివారం మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కైకరం, అక్కుపల్లి గోకవరం, గోకరాజుపాడు, తిమ్మయ్యపాలెం, కొత్తగూడెం, గోపీనాథపట్నం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ శ్రేణులు మాజీ జడ్పీటీసీ చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణిలతో కలిసి మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా వందల సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. జనసేన శ్రేణులు, తెలుగుదేశం శ్రేణులు పాల్గొన్నారు.



ఉంగుటూరులో మోటారు సైకిళ్ల ర్యాలీ




లింగపాలెంలో ప్రచారం చేస్తున్న పుట్టా, సొంగా.. పోలాసిగూడెంలో సొంగా బృందం ప్రచారం

కూటమితోనే రాష్ట్ర భవిష్యత్‌కు వెలుగు

లింగపాలెం, మే 5: అంధకారంలో కూరుకుపోయిన రాష్ట్ర భవిష్యత్‌ను వెలుగులోకి తేవడం కోసమే కూటమి ఏర్పడిందని, కూటమి అధికారంలోకి వచ్చాక ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి రోషన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని బాదరాల, ఆసన్నగూడెం, కలరాయనిగూడెం, అయ్యపరాజుగూడెం, బోగోలు, ములగలంపాడు, రంగాపురం గ్రామాల్లో వారు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఏ గ్రామాల్లో చూసినా అభివృద్ధే లేదని, పాడైపోయిన రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గరిమెళ్ళ చలపతిరావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మోరంపూడి మల్లికార్జునరావు, గుత్తా సత్యసాయివరప్రసాద్, ముసునూరి రాము, గారపాటి బుజ్జియ్య, పిల్లల శ్రీనివాసయాదవ్, బొల్లినేని శ్రీనివాసరావు, బలుసు శ్రీనివాసరావు, చాకమూడి శ్రీనివాసరావు, రాయంకుల చక్రధరరావు, నందిగం సీతారామతిలక్, తాడేపల్లి దాసు, అసిలేటి అజయ్, నత్తా నాగేంద్రబాబు, పల్లి శ్రీను పాల్గొన్నారు.

• కామవరపుకోట : చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ ఆదివారం పోలాసిగూడెం గ్రామంలో జోరుగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అబ్బూరి సాయికృష్ణ, ఒంటెద్దు ఏసువరప్రసాద్, అనిల్, బిక్కినవెంకట్రావు, రాయపాటి భాస్కరరావు, మల్లవరపు గిరి, పిన్నమనేని శ్రీనివాసరావు, గూడపాటి మధు, గెడ్డం గంగమ్మ, తాడేలుకృష్ణ, దిద్దుపూడి శ్రీను, పాలకుర్తి సాయి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

» డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు

కొయ్యలగూడెం, మే 5: రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు కోరారు. ఆదివారం జీలుగుమిల్లి మండలంలోని జిల్లెల్లగూడెం గిరిజన గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తమ గ్రామానికి రోడ్డు అధ్వానంగా ఉందని గత కొన్నేళ్ళు మట్టిరోడ్డుపైనే ప్రయాణం కొనసాగిస్తున్నామని వాపోయారు. గ్రామంలోని వాటర్‌ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని ఈ ట్యాంకు వాటర్ తాగితే అనారోగ్యాలకు గురవుతున్నామని గిరిజనులంతా ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మీ సమస్యలన్ని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆ గ్రామాల్లో పలువురు జనసేన పార్టీలో చేరారు. గిరిజన గ్రామాల పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రాజు, ఎంపీటీసీ నాబి శ్రీను, పి.అంకంపాలెం సర్పంచ్ జగ్గారావు, తదితరులు ఉన్నారు.



జిల్లెల్లగూడెంలో జనసేన పార్టీలో చేరిన గిరిజనులు

జంపింగ్ అభ్యర్థులా.. నాకు పోటీ ?

» గోపాలపురం కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు



రాళ్లకుంటలో సినీ హీరో నారా రోహిత్, మద్దిపాటి ప్రచారం

ద్వారకాతిరుమల, మే 5 : 'పక్క నియోజకవర్గాల్లో ఓడిపోయే అభ్యర్థులు ఇక్కడ మనకు ప్రత్యర్థులు.. వీళ్ల నాయకులు.. ఇటువంటి వాళ్లతో మనం పోటీపడాలి. 2009లో ఇక్కడ ప్రజలు ఓట్లు వేసి ఎమ్మెల్యేను చేస్తే 2014కు కొవ్వూరు జంప్ అయ్యారు. అక్కడి ప్రజలు గెలిపిస్తే 2024కు మళ్లీ ఇక్కడకు జంప్.. నిలకడలేని మీరా రాజకీయాలు చేసేది' అంటూ హోంమంత్రి వనితను గోపాలపురం నియోజకవర్గ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ఎద్దేవా చేశారు. మండలంలోని సత్తాల, పి.కన్నాపురం, మలసానికుంట, రాళ్లకుంట, కొమ్మర, కోడిగూడెం, ఐఎస్ రాఘవాపురం, జగన్నాథపురం తదితర గ్రామాల్లో ఆయన పార్టీ ప్రచారాన్ని నిర్వహించారు. రాళ్లకుంట, సత్తెన్నగూడెం గ్రామాల్లో సినీ హీరో నారా రోహిత్‌తో కలసి ఆయన ప్రచారాన్ని సాగించారు.




లోకేశ్‌కు స్వాగతం

ఏలూరులో ఆదివారం యువగళంలో భాగంగా 'హలో లోకేశ్' కార్యక్రమానికి విచ్చేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు ఒకేలు అందించి స్వాగతం పలుకుతున్న ఏలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బడేటి చంటి, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్.



అప్పనవీడులో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి చింతమనేని

రాబోయేది కూటమి ప్రభుత్వమే..

» దెందులూరు కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్

పెదపాడు, మే 5 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ పెదపాడు మండలం అప్పనవీడు, ఏపూరు, కలపర్రు, వట్లూరు తదితర గ్రామాల్లో ఆదివారం విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలుకగా, మహిళలు హారతులు ఇచ్చారు. ప్రచారంలో భాగంగా చింతమనేని మాట్లాడుతూ రాబోయేది కూటమి ప్రభుత్వమని, చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో తిరిగి సంక్షేమం, అభివృద్ధి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కూటమి శ్రేణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వలంటీర్ల బలవంతపు రాజీనామాలు ఆపాలి

» టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల డిమాండ్

కొయ్యలగూడెం, మే 5: వలంటీర్ల బలవంతపు రాజీనామాలు ఆపాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ నాయకులు గంగిరెడ్ల మేఘలాదేవి ఇంటి వద్ద ఏర్పాటు చేసి సమావేశంలో నాయకులు మాట్లాడారు. ప్రజలకు ఎంతో సేవలు చేస్తున్న వలంటీర్లను వైసీపీ ప్రభుత్వం రాజీనామా చేయిస్తుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్ వ్యవస్థ యథావిధిగా కొనసాగుతుందని, ప్రతీ వలంటీర్‌కు రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు వలంటీర్లను ఇబ్బంది పెట్టవద్దని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో పోలవరం జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజును, ఎంపీ అభ్యర్థి మహేష్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు బొల్లిన నిర్మలా కిషోర్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి, జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, పట్టణ అధ్యక్షుడు శ్రీను, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం.. మన బాధ్యత

పెదపాడు, మే 5: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి బి.లావణ్యవేణి ఆదివారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ 13న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.



వేములపల్లి సభలో మాట్లాడుతున్న నాయకులు

దళితులంతా ఏకమై టీడీపీని గెలిపించాలి

లింగపాలెం, మే 5: దళితులంతా ఏకమై టీడీపీని గెలిపించుకోవాలని, లేదంటే దళితులపై అత్యాచారాలు, హత్యలు ఎక్కువ అయిపోతాయని దళిత నాయకులు పేర్కొన్నారు. ఆదివారం వేములపల్లి గ్రామంలో నియోజకవర్గ దళిత నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై ఆకృత్యాలు, హత్యలు పెరిగిపోయానని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దళితులను అణచివేసే దిశగా నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని దళితులంతా ఏకమై చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

కామవరపుకోట మండలానికి చెందిన రాష్ట్ర క్రిసియన్ కార్పొరేషన్ డైరెక్టర్ పండు జగదీష్ తన అనుచరులు 150 మందితో కలిసి వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. లింగపాలెం మండలం వేములపల్లి సహా అనేక గ్రామాల నుంచి సుమారు వంద కుటుంబాల వరకు టీడీపీలో చేరారు. వారందరికి టీడీపీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గంటా మురళీరామకృష్ణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

ఏలూరు రూరల్, మే 5: ఏలూరు రూరల్ మండలం పాలగూడెంలో దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ విస్తృతస్థాయి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని చాటపర్రు, సగర్లపేటకు చెందిన రెడ్డిఏడుకొండలు, కె.రాంపండు, ఆర్.పిచ్చియ్య, రెడ్డిరాములు, కె.అంజితో సహా దాదాపు 30 కుటుంబాలు వైసీపీని వీడి చింతమనేని నాయకత్వాన్ని బలపరుస్తూ టీడీపీలో చేరారు. వారందరిని పార్టీ కండువా కప్పి చింతమనేని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేసి 13న జరిగే ఎన్నికల్లో కూటమి విజయం సాధించేలా కృషిచేయాలని పిలుపునిచ్చారు. జనసేన ఇన్‌చార్జి ఘంటసాల వెంకటలక్ష్మి, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు నంబూరి నాగరాజు, మేకల రవి, శేఖర్, కొటారి ఆదిశేషు, శివరామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన పాలగూడెం వైసీపీ నాయకులు

బాస్కెట్‌బాల్ పోటీలకు ఏలూరు క్రీడాకారులు

ఏలూరు స్పోర్ట్స్, మే 5: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈనెల 8 నుంచి 15వ తేదీ వరకు జరిగే 74వ జాతీయ జూనియర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశామని జిల్లా అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, జి.శ్రీనివాసరావు తెలిపారు. ఏలూరుకు చెందిన పి.నాగవినయ్‌శ్రీ, పావనీప్రియ, పి.జయశ్రీ, ఎ.ఈశ్వర్‌తేజలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు ఇటీవల నూజివీడులో జరిగిన 9వ రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ట్రెజరర్ కె.మురళీకృష్ణ తెలిపారు.



ఎంపికైన క్రీడాకారులు

సత్యసాయి సేవాసభ్యుల ప్రచార ర్యాలీ

ఏలూరు కార్పొరేషన్, మే 5 :భగవాన్ సత్యసాయిబాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి ఈనెల 6వ తేదీ సందర్భంగా స్థానిక రామకృష్ణాపురంలోని సత్యసాయి జిల్లా సేవాసంస్థల అధ్యక్షుడు కానుమిల్లి శశిశేఖరరావు అధ్యక్షతన ఆదివారం సత్యసాయి భక్తులు,చిన్నారులు భజనలు చేస్తూ ప్రచారర్యాలీ ప్రారంభించారు. సత్యసాయి భక్త బృందం ప్రతినిధులు పి.రామారావు, సత్య కనిగొళ్ళ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, మే 5 : రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

క్రైం వార్తలు

గోడకూలి భవన నిర్మాణ కార్మికుడి మృతి

పోలవరం, మే 5 : పాత ఇంటి గోడ కూలి భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన పోలవరంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాలివి.. పోలవరం పంచాయతీ పాతపోలవరానికి చెందిన పోలవరపు వీరభద్రం(46) తన ఇంటికి సమీపంలో ఉన్న శిథిలావస్థలో ఉన్న ఇంటి గోడలు పడగొడుతున్న సందర్భంలో ఇంటి గోడ కూలి మీదపడి మృతి చెందాడు. మృతుడికి డిగ్రీ, టెన్త్ చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం బంధువులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.



వీరభద్రం మృతదేహం

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, మే 5 :వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు రైల్వే స్టేషన్ దగ్గర సుమారు 30 నుంచి 35 ఏళ్ళ వయస్సు కల్గిన వ్యక్తి మృతి చెంది ఉన్నాడని ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు 5.5 అడుగుల ఎత్తుకల్గి, ఛాతీపై రాజు అనే పచ్చబొట్టు, కుడి భుజంకింద రాజీ అని, పాము గుర్తు గల పచ్చబొట్లు ఉన్నాయి. నీలం రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. అతడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ 95020 97672 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

గోదావరిలో స్నానానికి వెళ్లి ఓ వ్యక్తి మృతి

పోలవరం, మే 5 :బంధువుల ఇంటికి వచ్చి సరదాగా గోదావరి స్నానానికి వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం పోలవరంలోని స్థానిక ఆంజనేయస్వామి ఆలయం రేవులో జరిగింది. జంగారెడ్డిగూడెంకు చెందిన కారు డ్రైవర్ షేక్ అహ్మద్ బాషా(45) పోలవరం గ్రామంలో తన బంధువుల ఇంటికి వచ్చి మరో ఏడుగురితో కలిసి గోదావరికి స్నానానికి వెళ్ళాడు. స్నానం చేస్తుండగా గోదావరి ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు నదిలో పడవలతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం సమయంలో మృతదేహం లభ్యమైంది. మృతుడికి ఇంటర్, ఏడో తరగతి చదువుతున్న ఒక పాప, బాబు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



అహ్మద్‌బాషా (ఫైల్)

కుక్కునూరులో వడదెబ్బతో ఒకరి మృతి

కుక్కునూరు, మే 5 :కుక్కునూరు మండల కేంద్రంలో దారా రమేష్ (45) అనే వ్యక్తి వడదెబ్బ తగిలి చనిపోయాడు. బయటకు వెళ్లి వస్తూ ఇంటికి సమీపంలో ఉన్న దిమ్మపై పడుకున్నాడు. కొంత సమయం తరువాత ఇది గమనించిన కుటుంబసభ్యులు వెళ్లి పలకరించగా స్పృహ కోల్పోయి ఉన్నాడు. స్థానిక 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళల దుర్మరణం

నందిగామ (ఎన్టీఆర్‌జిల్లా), మే 5:నందిగామ మండలం అంబారుపేట గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతిచెందారు. సీఐ హనీష్ తెలిపిన వివరాలివి.. ద్వారకాతిరుమల నుంచి హైదరాబాద్‌కు ఆసుపత్రి పనిమీద కారులో వెళ్తున్న ఇద్దరు మహిళలు అంబారుపేట వద్ద కారు దిగి రోడ్డు దాటుతుండగా మరో కారు వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ చనిపోయారు. మృతుల్లో బొప్పన స్వరూపరాణి(60) విజయవాడ లోని రామవరప్పాడు కాగా, వేగి పద్మజ (50) ద్వారకా తిరుమలకు చెందినవారు.



ప్రాణాలతో చెలగాటం..

రెక్కాడితే కానీ డొక్కాడని కూలీలు నిత్యం ప్రమాదపు టంచుల్లో పనులకు వెళ్ళి వస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. 8 మంది ఎక్కే ఆటోలలో 15 నుంచి 20 మంది కూలీలను ఎక్కించి అతి వేగంగా దూసుకుపోతున్నారు. ఆటోకు అటు, ఇటు, వెనుక నిలబడి కూలీలు వెళ్తున్న దృశ్యాలు చూస్తే వళ్ళు జలదరించాల్సిందే. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా మార్పు రావటంలేదు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేయటమే కాని అధికారులు కూడా పట్టించుకోవటం లేదని పలువురు వాపోతున్నారు. గతంలో ఏ ఊరి కూలీలు ఆ ఊరిలోనే పనులు చేసుకునేవారు. ఇప్పుడు ఇతర గ్రామాలు, మండలాలకు కూడా కూలీలు ఆటోల్లో పనులకు వెళుతున్నారు. వివిధ కారణాల వల్ల గ్రామాల్లో కూలీల సంఖ్య రానురాను తగ్గిపోతోంది. దీంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. రైతులు సకాలంలో వ్యవసాయ పనులు చేయించుకోవటానికి ఇతర గ్రామాల నుంచి కూలీలను ఆటోలలో రప్పించి పనులు చేయించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆటోలలో అధికలోడు అతివేగానికి కళ్ళెం వేయాలని పలువురు కోరుతున్నారు.

-చాట్రాయి

వాహనాల విస్తృత తనిఖీలు



ముసునూరు, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాల విస్తృత తనిఖీలు చేపట్టింది. ఆదివారం ముసునూరు శివారు నేలపాటికుంట వద్ద ఏలూరు జిల్లా మార్కెట్ మేనేజర్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ప్రసాద్ గుప్తా ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం, తాయిలాలు, రూ. 50వేలకు మించి రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎన్నికల స్పెషల్

ఆనాటి ముచ్చట

చాట్రాయి నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు



మిర్యాల పూర్ణానంద్



చిన్నం రామకోటయ్య

గతంలో ఉమ్మడి కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లాలో మారుమూల మండల కేంద్రం చాట్రాయి నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలుగా గెలుపొంది చట్టసభలో వాణి వినిపించారు. 1952 నుంచి 2009 వరకు చాట్రాయి మండలం తిరువూరు ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో ఉండేది. 1983లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా మిర్యాల పూర్ణానంద్ తిరువూరు అసెంబ్లీకి పోటీ చేసి గెలుపొందారు. ఉపాధ్యాయులు మిర్యాల ప్రేమానంద్ దంపతుల కుమారుడైన పూర్ణనంద్ డిగ్రీ వరకు చదివి రాజకీయాలలోకి వచ్చి మొదటి ప్రయత్నంలోనే విజేతగా నిలిచారు. అనంతరం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా పూర్ణానంద్ పనిచేశారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో చాట్రాయి మండలం నూజివీడు జనరల్ స్థానం పరిధిలోకి వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికల్లో చిన్నం రామకోటయ్య టీడీపీ అభ్యర్థిగా నూజివీడు అసెంబ్లీకి పోటీచేసి గెలుపొందారు. సామాన్య వ్యాపార కుటుంబం చిన్నం సుబ్బారావు, లక్ష్మీసరోజిని దంపతుల పెద్ద కుమారుడైన రామకోటయ్య ఇంజినీరింగ్ చదివి, చాలా కాలం హైదరాబాద్ అర్బన్ డవలప్‌మెంట్ సంస్థ(హుడా)లో వివిధ స్థాయిలో ఉద్యోగం చేశారు. తరువాత ఉద్యోగానికి రాజీనామా చేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తూ రాజకీయాలలోకి వచ్చి మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించారు. పూర్ణానంద్, రామకోటయ్య చాట్రాయి గ్రామ, మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేశారు. - చాట్రాయి

క్రైం వార్తలు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం

నూజివీడు టౌన్, మే 5: నూజివీడు మండలం అన్నవరం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం పాలైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. నూజివీడు నుంచి విస్సన్నపేట వెళుతున్న వ్యాన్ హనుమంతుల గూడెం వైపు నుంచి వస్తున్న ఆటోను ఢీనడంతో ఆటో డ్రైవర్ కర్నికోటి రాంబాబు (35) ఎగిరి రోడ్డుపై పడగా అతనిపై నుంచి వ్యాన్ వెళ్ళడంతో తల ఛిద్రమై ఘటన స్థలంలోనే రాంబాబు మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు నూజివీడు రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హనుమంతులగూడెంకు చెందిన మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, మే 5 : వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు రైల్వే స్టేషన్ వద్ద సుమారు 30-35 ఏళ్ళ వయస్సు కల్గిన వ్యక్తి మృతి చెంది ఉన్నట్టు ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో ఏలూరు రైల్వే ఎస్ఐ డి. నరసింహారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు, ఛాతీపై రాజు అనే పచ్చబొట్టు, కుడి భుజం కింద రాజీ అని, పాము గుర్తు గల పచ్చబొట్లు ఉన్నాయి. నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ సెల్ నెంబర్ 95020 97672కు సమాచారం అందించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై కేసు నమోదు

ముసునూరు, ఏప్రిల్ 5: ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై ముసునూరు ఎస్ఐ పి.వాసు ఆదివారం కేసు నమోదు చేశారు. గుళ్ళపూడి గ్రామానికి రైతు గద్దె సత్యనారాయణ, లోపూడి రైతులు తలకొండ వీరాస్వామి, ముద్దల సత్యనారాయణ, గుడిపాడు రైతు కె.సత్యనారాయణ పొలాల్లో వ్యవసాయ విద్యుత్ మోటార్లకు సంబంధించిన సింగిల్‌ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు శనివారం రాత్రి పగులగొట్టి అందులో ఉన్న రాగి వైరు, సామగ్రిని చోరీ చేశారని ట్రాన్స్‌కో ఏఈ హేమసుందర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ప్రత్యేక నిఘా పెట్టాలని ఏఈ పోలీసులకు కోరారు.

ఏలూరు ఎవరిదో ?





- ఒకరేమో తలపండిన రాజకీయ కురువృద్ధునికి స్వయానా అల్లుడు. టీటీడీ బోర్డు చైర్మన్‌గా వ్యవహరించిన నేతకు తనయుడు. పోలవరం ప్రాజెక్టు పనుల్లో ఒకింత అనుభవం ఉన్న వ్యక్తి. యువరక్తం ఉరకలు వేస్తుండగా తొలిసారిగా ఏలూరు లోక్‌సభ రాజకీయ రణరంగంలోకి కూటమి పక్షాన టీడీపీ బలపరిచిన తెలుగుదేశం అభ్యర్థిగా పుట్టా మహేష్ యాదవ్ నిలిచారు.
- మరొకరు బీసీ వర్గాల ప్రతినిధిగా వైసీపీలో ముఖ్యనేతగా, రాష్ట్రమంత్రిగా ఉన్న నేతకు స్వయాన తనయుడు. రాజకీయాలు అంటే అలావోక కాదని తన తండ్రి పక్షాన రాజకీయాల్లో, ఎన్నికల్లో బాసటగా ఉన్న యువనేత. తండ్రి కారుమూరి నాగేశ్వరరావు అసెంబ్లీకి పోటీ పడుతుండగా ఆయన తనయుడు సునీల్ కుమార్ వైసీపీ నుంచి ఏలూరు లోక్‌సభకు పోటీ పడుతున్నారు.
- ఇన్నాళ్లు ఉనికి కోసం ఆరాట పడిన కాంగ్రెస్‌లో అందునా ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికల బరిలో తొలిసారిగా మహిళా అభ్యర్థి కావూరి లావణ్య పోటీ పడుతున్నారు. కేవలం కుటుంబ నేపథ్యం, పార్టీపై నిబద్ధతతోనే ఈ ఎన్నికల్లో మిగతా అభ్యర్థులతో పోరాటానికి దిగారు. వీరితో పాటు బరిలో మరో 11 మంది అభ్యర్థులు నిలిచారు.

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు లోక్‌సభ స్థానంలో నువ్వానేనా అన్నట్లుగా ప్రచారం సాగుతోంది. అన్నివర్గాలు చేరువ కావడానికి చేయని ప్రయత్నం లేదు. పోలవరం ప్రాజెక్టు ప్రధాన ప్రచార అస్త్రంగా నిలిచిపోయిన చింతలపూడి ఎత్తిపోతల వాగ్దానంగా నియోజకవర్గాల్లో పూర్తికాని పనులు అమలు కాని హామీలు అస్త్రాలుగా లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ప్రచారంలో హోరెత్తుతున్నాయి. ఏలూరు లోక్‌సభ స్థానానికి పోటీపడుతున్న వారిలో రాజకీయ నేపథ్యం కలిగిన వారితో పాటు మిగతా వారంతా వివిధ వృత్తుల్లో రాణించిన వారు. వీరంతా ఇండిపెండెంట్‌గా రంగంలో ఉన్నారు. ఇప్పటికే దఫాలవారీగా పట్టణాలు, నగరాలు, పల్లెల్లో ప్రచారం పూర్తి చేసుకుని పోలింగ్ దిశగా సాగుతున్నారు.వీరందరిలో బలమెంత? బలహీనత ఏంటి? ఏది ప్రచారాస్త్రం? మరేది ప్రజాకర్షణ ? గెలుపు ఎవరిదనే దానిపైనే ప్రజల్లో అత్యంత ఉత్కంఠ అయితే నెలకొంది. తమ తీర్పు ఇచ్చేందుకు ఓటర్లు ఈనెల 13న సిద్ధమవు తున్నారు. ఇప్పటిదాకా ఏలూరు లోక్‌సభలో సాగిన రాజకీయ ప్రచార సరళిపైన అభ్యర్థుల తీరుపైన ఒక విశ్లేషణ.

- ఓటర్లను తాకిన యువ కెరటం
- పోలవరం ప్రాజెక్టే ప్రధానాస్త్రం
- మిగిలిపోయిన పనులపైనే పదునెక్కిన ఆరోపణలు
- కూటమి అభ్యర్థి మహేష్ యాదవ్ ప్రచారాస్త్రాలు
- వైసీపీ అభ్యర్థి సునీల్‌కు సవాళ్ళు ఎన్నో
- కాంగ్రెస్, ఇండిపెండెంట్ల హోరా హోరీ ప్రచారం
- గెలుపు గుర్రాన్ని అధిరోహించేందుకు ఎన్నో తంతాలు

ఏలూరు లోక్‌సభ స్థానంపై విశ్లేషణ



పొలిటికల్ రివ్యూ

కాంగ్రెస్ పక్షాన లావణ్య పోరాటం



లోక్‌సభ అభ్యర్థిగా రంగంలోకి దిగిన కారుమూరి లావణ్య ఏలూరు లోక్‌సభ స్థానంలో ప్రచారంలో ఒకింత దూసుకుపోతూనే ఉన్నారు. రాజ కీయాల్లో ప్రత్యక్షంగా ఇప్పటిదాకా లేకపోయినా తొలిసారిగా లోక్‌సభ స్థానానికి పోటీ పడుతున్నారు. కాస్తంత రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి లావణ్య వచ్చారు. పీసీసీ చీఫ్ షర్మిల ఇచ్చిన స్ఫూర్తితో ఆమె వివిధ నియోజకవర్గాల్లో ప్రచారాన్ని హోరెత్తించేటట్లుగా ప్రయత్నం చేస్తున్నారు. ముంపు గ్రామాల్లోనూ, ఇతర నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ నేతలను కలుపుకుపోతూ ముందుకు సాగుతున్నారు. తనను గెలిపిస్తే ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి పరుగులు తీయిస్తానని హామీ ఇస్తున్నారు. కాంగ్రెస్ పక్షాన అసెంబ్లీ అభ్యర్థులుగా ఉన్నవారితో సమన్వయం చేసుకుని కొంతలో కొంత ముందుకు వెళుతున్నారు.

మహేష్ యాదవ్ బలమెంత ?



ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో కూటమిపక్షాన ఎవరిని రంగంలోకి దింపాలనే దానిపై సుదీర్ఘకసరత్తు సాగింది. రాష్ట్ర రాజకీయాల్లో సీనియర్, మాజీమంత్రి యనమల రామకృష్ణుడి అల్లుడు, విద్యావంతుడు పుట్టా మహేష్ యాదవ్‌ను కూటమి పక్షాన రంగంలోకి దించారు. ఆదిలో మహేష్‌పై నాన్‌లోకల్ ముద్ర వేసేందుకు వైసీపీ ప్రయత్నించింది. యాదవ్ తేరుకుని రాజకీయ అస్త్రశస్త్రాలను సంధిస్తూ వచ్చారు. ఇన్నాళ్ళు.. ఈ ఐదేళ్లు మీరంతా ఉండి, ఏలూరు లోక్‌సభ స్థానంలో ఏం అభివృద్ధి చేశారు ? పోలవరం ఎందుకు కట్టలేదు ? చింతలపూడిని ఎందుకు పూర్తి చేయలేకపోయారు ? తాగు, సాగు నీరును పూర్తిగా రప్పించలేకపోయిందెవరు ? మీరు కాదా ? అంటూ వైసీపీపై స్ట్రాంగ్ కౌంటర్ ఇవ్వడంతో లోకల్ వివాదం కాస్త తొలిగిపోయింది. దెందులూరు నియోజకవర్గంలో కూటమి పక్షాన మార్పులు, చేర్పులు చేసేందుకు ప్రయ త్నాలు జరిగినా అక్కడ టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ పక్షానే మహేష్ నిలబడ్డారు. అధిష్ఠానాన్ని ఒప్పించి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభాకర్‌కే దెందు లూరు ఇచ్చి తీరాల్సిందేనని పట్టుబట్టి చివరికి అదీ సాధించారు. నూజివీడు నియోజక వర్గంలో పార్టీ అభ్యర్థిగా కొలుసు పార్థసారథి రంగంలో ఉండగా, ఆయనపై రెబల్ అభ్యర్థిగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కొన్నాళ్ళపాటు టెన్షన్ పెట్టారు.ఈ సమస్యను కూడా స్వల్ప వ్యవధిలోనే మహేష్ కొలిక్కి తేగలిగారు. ఈ రెండు చోట్ల మహేష్‌యాదవ్ చురుగ్గా వ్యవహరించటం పార్టీ లోనూ, ప్రజల్లోనూ ఆయన ఇమేజ్ పెంచేలా చేసింది. ఏలూరు లోక్‌సభ స్థానంలో పోలవరం నుంచి జనసేన అభ్యరి చిర్రి బాలరాజు, మిగతా వర్గాల మధ్య అంతరం ఏర్పడినప్పుడు కూడా చంద్రబాబు ఆదేశాల మేరకు చొరవ తీసుకొని అందరినీ ఒకటి చేయగలిగారు. ఏలూరు లోక్‌సభలో కూటమి పక్షాన తెలుగుదేశం దెందులూరు, ఏలూరు, చింతలపూడి, నూజివీడు నియోజకవర్గాల్లో పోటీ పడు తుండగా, కైకలూరులో బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, పోలవరం, ఉంగుటూరు నియోజక వర్గాల్లో జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు పోటీ పడుతున్నారు.

ప్లస్ పాయింట్లు

- విద్యావంతుడు, రాజకీయ కుటుంబ నేపథ్యం
- తానేం చేయదలచుకున్న పనులపై విస్తృత ప్రచారం.ఏలూరు స్మార్ట్‌సిటీ, చింతలపూడి ఎత్తిపోతల పూర్తి, మామిడి, పామాయిల్, మొక్కజొన్న వరి పంటలపై రైతులకు అండగా ఉండటం వంటి హామీలతో పైచేయి.
- కీలకమైన కొల్లేరు కాంటూరు పరిధి కుదింపులో కీలకంగా వ్యవహరిస్తానంటూ ఇచ్చిన హామీ హైలెట్.
- జనసేనాని పవన్‌కల్యాణ్‌తో కలిసి నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కింద రక్షణనిధికి కోటిరూపాయలు విరాళం ప్రకటించడంతో మహేష్‌యాదవ్ నిర్వా సితుల్లో తనదైన ముద్ర వేసుకోగలిగారు.
- తెలుగుదేశం అధినేత చంద్రబాబు నూజివీడు, దెందు లూరులోనూ జనసేన అధిపతి పవన్‌కల్యాణ్, కైకలూరు, కొయ్యలగూడెం, గణపవరంలోనూ విస్తృతంగా పర్యటించడం కూడా కలిసొచ్చేదిగానే అంచనా వేస్తున్నారు.
- ఏలూరు లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటిదాకా పోటీచేసిన అభ్యర్థుల కంటే మహేష్ యాదవ్ ఒక్కరే పిన్న వయస్కుడు కావడం కూడా యువతను ఆకట్టుకు నేందుకు ప్రత్యేకంగా కలిసొచ్చింది.

వైసీపీలో సునీల్ కుమార్ బలగం ఎంత ?



వైసీపీ నుంచి ఏలూరులోక్‌సభ అభ్యర్థిగా కారుమూరు సునీల్‌కుమార్ రంగంలో ఉన్నారు. రాష్ట్రమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు సునీల్ కుమార్ తనయుడు. బీసీవర్గాల ప్రతినిధులుగా అటు టీడీపీ పక్షాన మహేష్ యాదవ్, ఇటు వైసీపీ పక్షాన సునీల్‌కుమార్ ఇద్దరు రంగంలో ఉండటంతో ఏలూరు లోక్‌సభలో బీసీ వార్ జరుగుతోంది. ఈ వార్‌లో ఎవరిది పైచేయి అనేది ఎవరంతటి వారుగా తమదేననే ధీమాతో ఉన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో పార్టీలో నెలకొన్న విభేదాలు సునీల్ కుమార్‌కు తలనొప్పి గానే ఉన్నాయి. సిట్టింగ్ ఎంపీ కోటగిరి శ్రీధర్ అనుకూల వర్గం కొన్నిసార్లు అలగటం, సీనియర్లు ఇంకొందరు వ్యక్తిగతంగా వ్యవహరించటం వీటన్నింటిని ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ తండ్రి, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పరిష్కరించాల్సి వచ్చింది. తన సమీప ప్రత్యర్థి మహేష్ యాదవ్ ఒకవైపు అందర్నీ కలుపుకుపోతూ దూసుకు వెళ్ళటం, విమర్శలతో సవాళ్ళు విసరటం చేస్తుంటే సునీల్‌కుమార్ మాత్రం ఈ విషయంలో వెనుకబడ్డారు. బీసీవర్గాల నుంచి సంపూర్ణ మద్దతు దక్కుతుందని భావిస్తున్నా నియోజకవర్గాల్లో మాత్రం బీసీలతో పాటు మిగతా వర్గాల నుంచి అనుకున్నంతగా మద్దతు కూడగట్టుకోలేకపోయారన్న విమర్శలు పార్టీలో ఉన్నాయి. కేవలం పార్టీ మద్దతు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ప్రస్తుత అభ్యర్థులు మీదే సునీల్ పూర్తిగా ఆధారపడాల్సి వచ్చింది. పోలవరం ప్రాజెక్టుపై రైతు లను, ఇతర వర్గాలను పూర్తిగా ఆకట్టుకోకపోవడం, చింతలపూడి ఎత్తిపోతల వంటి పనులు పెండింగ్‌లో పడటం కూడా సునీల్‌కు మైనస్ పాయింట్లు అయ్యాయని అంచనా వేస్తున్నారు. కైకలూరు వంటి నియోజకవర్గాల్లోనూ బలీయంగా ఉన్న బీసీ ఓటర్లు పూర్తిగా తనవైపు తిప్పుకోవడానికి సునీల్ అభ్యర్థిపరంగా ముందుకు వెళ్ళలేకపోయారని ఇంకోవాదన.

ప్లస్ పాయింట్లు

- తన తండ్రి కారు మూరి నాగేశ్వరరావు మంత్రిగా ఉండటం పార్టీ శ్రేణులు ప్రచారంలో కలిసి రావడం
- సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ప్రస్తుత అభ్యర్థులు వ్యవహారాన్ని అంతటిని చక్కపెట్టడం
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు, దెందులూరులో పర్యటించటం కలిసొచ్చేదిగా భావిస్తున్నారు.



గ్రామాల్లో అసెంబ్లీ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ప్రచారం



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులను ఆహ్వానిస్తున్న కామినేని

ప్రణాళికతో గ్రామాల అభివృద్ధి : కామినేని

కైకలూరు, మే 5: ప్రణాళికతో గ్రామాల అభివృద్ధికి కృషి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తానని కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరు మండలం వేమవరప్పాడు, తామరకొల్లు, వింజరం, ఆచవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటా మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను గ్రామస్థులు కామినేని దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటి వరకు వైసీపీ పాలనలో ఆయా గ్రామాల్లో వివిధ వ్యక్తులపై కేసులు పెట్టిన అంశాలను కామినేనికి వివరించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తానని, ఆచవరంలో ఆర్వో ప్లాంట్ నిర్మించి ప్రజల దాహార్తిని తీరుస్తానన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆచవరంలో 18 రహదారులు నిర్మాణం చేపట్టానని వైసీపీ పాలనలో కేవలం 120 మీటర్ల రహదారి నిర్మాణం మాత్రమే జరిగిందన్నారు. ఈ పాలనలో అన్ని రకాల వసతులను ప్రజలు కోల్పోయారని ప్రణాళిక రూపొందించి గ్రామాల్లో వసతులు కల్పిస్తామన్నారు. తాగు, సాగునీరు, రహదారులు వంటి వాటిపై ఎక్కువ దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తానని, అలాగే పుల్లవ డ్రైన్ ముంపు గ్రామంలోకి రాకుండా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. వేమవరప్పాడు, ఆచవరం గ్రామాల్లో వైసీపీ నుంచి తలారి శ్రీహరి, తలారి రంగదాసు, బోడావుల ఆదిశేషు, బోడావుల వెంకటేశ్వరరావుతో పాటు 20 కుటుంబాల ప్రజలు, కట్టా లక్ష్మయ్య తదితరులు స్వచ్ఛందంగా బీకేఎం నాని ఆధ్వర్యంలో కూటమిలో చేరగా కామినేని వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, జడ్పీటీసీ కురేళ్ళ బేబి, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, గంగుల శ్రీదేవి, గంగుల వెంకట నరసమ్మ, నున్న వనితాజ్యోతి, బోడావుల వసంతరావు, నున్న కొండా, పూల రామచంద్రరావు, పి. రాధాకృష్ణ, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మి, ఏకుల కృష్ణయ్య, ధర్మరాజుల సత్యనారాయణ, కుర్మా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ మార్పుపై కామినేని హర్షం..

వైసీపీ పాలనలో అధికారాన్ని దుర్వినియోగం చేసిన ఏ అధికారికైనా శిక్ష తప్పదని కామినేని అన్నారు. ఆదివారం రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని ఎన్నికల కమిషన్ బదిలీ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో కామినేని హర్షం వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేశారని, రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించారని ఇలాంటి అధికారులకు ఎప్పటికైనా ఇలాంటి శిక్షలే విధిస్తారన్నారు. వైసీపీకి అనుకూలంగా రాజేంద్రనాథ్ రెడ్డి పోలీసు వ్యవస్థను నడిపిస్తున్నారని, కొత్త డీజీపీగా ఎవరు వచ్చినా ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించుకునేందుకు పోలీసులందరూ ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకుంటారన్నారు.

మండవల్లిలో కామినేనికి మద్దతుగా ప్రచారం

మండవల్లి: మండవల్లిలో ఆదివారం తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని పార్టీ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షులు నారగాని నాగేశ్వరరావు, గుడివాడ చిట్టిబాబు, సజ్జ బాబి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలిదిండిలోని మద్వానిగూడెం వంతెనపై తగ్గిన జన సంచారం



నిర్మానుష్యంగా చాట్రాయి సెంటర్

సన్ డే

ఎండ, వడగాల్పులకు అల్లాడిన జనం

కలిదిండి, మే 5: భానుడి ప్రతాపానికి ఆదివారం కలిదిండి ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రంగా ఉండటంతో వృద్ధులు, గర్భిణులు, చంటి పిల్లల తల్లులు ఉక్కపోతతో అల్లాడిపోయారు. నిత్యం రద్దీగా ఉండే మద్వానిగూడెం వంతెన, కలిదిండి సెంటర్ ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ప్రయాణికులు లేక బస్సులు ఖాళీగానే రాకపోకలు సాగించాయి. మే నెల ప్రారంభంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుండటంతో రోహిణికార్తెలో ఎండలు మెండుగా ఉండే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చాట్రాయి: ఆదివారం ఎండ, వడగాల్పులతో ప్రజలు అల్లాడిపోయారు. ఎండకు భయపడి ప్రజలు ఇళ్ళకే పరిమితం కావటంతో మధ్యాహ్న సమయంలో వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఫ్యాన్లు నుంచి సైతం వేడిగాలి వీస్తుండటంతో వృద్ధులు అల్లాడిపోయారు. ఎండకు మూగజీవాలు చెట్ల నీడకు చేరుతున్నాయి. పశువులు నీరు కన్పిస్తే అందులో దిగి సేద తీరుతున్నాయి.

పెన్షన్ సొమ్ము బాకీకి జమ!



తిరువీధి మారయ్య

చాట్రాయి, మే 5: తన పెన్షన్ సొమ్ము రూ. 3,000 బ్యాంకు లోన్‌కు జమ చేసుకున్నారని చాట్రాయి మండలం ఆరుగొలనుపేట గ్రామానికి చెందిన చర్మకార పింఛన్‌దారుడు తిరువీధి మారయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ నెల పెన్షన్ సొమ్ము చాట్రాయి ఎస్‌బీఐ జన్ ధన్ ఖాతాలో పడినట్లు సచివాలయ సిబ్బంది చెప్పటంతో 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న చాట్రాయి ఎస్బీఐకు వెళ్ళగా లోన్‌కు జమచేసుకున్నట్టు చెప్పారని, పెన్షన్ సొమ్ము లోన్‌కు జమవేసుకోవద్దని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించినా బ్యాంకు అధికారులు ఈ విధంగా చేయటం అన్యాయమని మారయ్య వాపోయాడు.

నేడు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేత

చాట్రాయి, మే 5: మండలంలోని తుమ్మగూడెం సబ్ స్టేషన్‌లో భారీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున, 6వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు త్రీ ఫేజ్ కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ సంజయ్ తెలిపారు. ఈ విషయాన్ని తుమ్మగూడెం, జయపురం, టి. గుడిపాడు గ్రామాల రైతులు గమనించాలని, సింగల్ ఫేజ్ సప్లై మాత్రం పక్క సబ్ స్టేషన్లు నుంచి నిరంతరం సరఫరా చేస్తామని ఏఈ చెప్పారు.

నేడు కామినేనికి మద్దతుగా ప్రముఖుల ప్రచారం

కైకలూరు, మే 5: కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు మద్దతుగా సోమవారం ఇద్దరు రాజ్యసభ సభ్యులు కె. లక్ష్మణ్, విజయేంద్రప్రసాద్ కైకలూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు కూటమి నాయకులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఆటపాక నుంచి సీఎన్నార్ గార్డెన్ వరకు రాజ్యసభ సభ్యులతో కలసి కామినేని ర్యాలీ నిర్వహించి అనంతరం సీఎన్నార్ గార్డెన్లో కూటమి నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. సాయంత్రం 5 గంటలకు సినీ నటుడు నారా రోహిత్ కామినేనికి మద్దతుగా కైకలూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. కార్యక్రమాలకు నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.



చర్చికి వాటర్ కూలర్ వితరణ

చాట్రాయి, మే 5: మండలంలోని కోటపాడు దళితవాడలోని చర్చికి తెలుగు రైతు నాయకుడు బొట్టు సత్యనారాయణ వితరణగా ఇచ్చిన వాటర్ కూలర్‌ను, ఆదివారం ఎన్నారై టీడీపీ నాయకుడు బొట్టు వంశీ చేతుల మీదుగా పాస్టర్ లాజర్‌కు అందజేశారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘన విజయం సాధించి అధికారంలోకి రావాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బెల్ట్‌షాపుల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు

ముదినేపల్లి రూరల్, మే 5: గ్రామాల్లో బెల్ట్‌షాపుల వద్ద మద్యం విక్రయాలు జరుగుతున్నా పోలీసులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారుల అండదండలతో బెల్ట్‌షాప్ నిర్వాహ కులు మద్యం విక్రయాలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించడంతో బెల్ట్‌షాపు నిర్వాహకులు వెనక్కి తగ్గడం లేదని ప్రజలు అంటున్నారు. వడాలి, గురజ గ్రామాల్లో రెండు రోజులుగా తనిఖీలు చేస్తున్నా మద్యం విక్రయాలు ఏ మాత్రం తగ్గటం లేదు.